ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

అన్నమయ్య
జిల్లా వార్తలు

5

మంగళవారం 10 సెప్టెంబరు 2024


గుర్రంకొండలో...


పెద్దతిప్పసముద్రంలో...


సిద్దవటంలోని పెన్నానదిలో నిమజ్జనం


సంబేపల్లెలో...


రైల్వేకోడూరులో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


కలికిరి నిమజ్జనోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా రాజువారిపల్లె విగ్రహం

గంగ ఒడికి.. గణనాథుడు

● జిల్లా వ్యాప్తంగా ఘనంగా గణేశ్ నిమజ్జనం ● పీలేరులో శోభాయమానంగా శోభాయాత్ర ● సంప్రదాయ నృత్యాలు, కేరళ డ్రమ్స్, యువకుల కేరింతలు

పీలేరు, సెప్టెంబరు 9: యువకుల కేరింతలు, నృత్యాలు, హోరెత్తించే డీజేలు, ఉర్రూతలూగించే బళ్లారి డ్రమ్ములు, కేరళ సంప్రదాయ నృత్యాలు, బాణాసంచా పేలుళ్లు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలు, భారీ వినాయక విగ్రహాలు....వీటన్నింటిని మధ్య "జై బోలో గణేశ్ మహరాజ్ కీ...జై" అంటూ నినాదాలతో జిల్లా వ్యాప్తంగా సోమవారం గణేశ్ నిమజ్జనాలు వైభవంగా జరిగాయి. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి ఘట్టమైన నిమజ్జనం సోమవారం పీలేరులో అంగరంగ వైభవంగా జరిగింది. సర్వమత సమ్మేళనంగా, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాలు సమిష్టిగా కృషి చేసి వినాయకుడిని అత్యంత శాస్త్రోక్తంగా సాగనంపారు. నిమజ్జన కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి వరకు సాగింది. పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద విగ్రహాలకు ఆర్ఎస్ఎస్ నాయకులు, పట్టణ ప్రముఖులు హారతి సమర్పించారు. నిమజ్జన ర్యాలీని వీక్షించేందుకు పెద్దఎత్తున మహిళలు, చిన్నారులు, ప్రజలు పట్టణ ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డులో బారులు తీరారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పీలేరు పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ప్రతిష్ఠించిన 186 విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. కాగా జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట, తంబళ్లపల్లె, పీలేరు, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని అన్ని పల్లెల్లో కొలువుదీరిన విగ్రహాలను సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. కలికిరిలో సోమవారం రాత్రి జరిగిన గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవంలో రాజువారిపల్లె గ్రామస్థులు ఏర్పాటు చేసిన గణపతి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలంకరణలోనూ ప్రత్యేకత చాటుకుంది. విగ్రహ ఊరేగింపు ముందు భాగంలో వివిధ భంగిమలతో చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. భారీ విగ్రహానికి చేసిన రంగురంగుల విద్యుద్దీపాలంకరణలు విశేషంగా కనిపించాయి.


పీలేరులో నిమజ్జనానికి బయలుదేరిన భారీ గణపయ్యకు హారతి ఇస్తున్న ప్రజలు


నిమజ్జన ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్య కళాకారులు


పీలేరులో శోభాయమానంగా ముందుకు సాగుతున్న నిమజ్జన శోభాయాత్ర

రూ.2.80 లక్షలకు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న బొట్టా నరసింహులునాయుడు



మేకావారిపల్లె గణేశ్ లడ్డూ రూ.2.80 లక్షలు

● 1.45 లక్షలు పలికిన వెంకటరాజంపేట లడ్డు

రాజంపేట, సెప్టెంబరు 9: రాజంపేట మండలం మేకావారిపల్లెలో గణనాథుని లడ్డూ వేలం పాట అట్టహాసంగా నిర్వహించారు. రూ.2.80 లక్షలకు ఆ గ్రామానికి చెందిన బొట్టా నరసింహులునాయుడు దక్కించుకున్నారు. పోటాపోటీగా జరిగిన 30 కిలోల లడ్డూ వేలం పాట చివరిగా నరసింహులునాయుడు భక్తిశ్రద్ధలతో దక్కించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనను అభినందించారు.

కేశాపురం లడ్డు రూ.2.61 లక్షలు



చిన్నమండెం, సెప్టెంబరు 9: మండలంలోని కేశాపురం గ్రామ పంచాయతీలోని కేశాపురంలో కొలువైన గణనాథుడి లడ్డును అదే గ్రామానికి చెందిన నరం మధుసూదన్‌రెడ్డి వేలం పాటలో రూ.2.61 లక్షలకు లడ్డు దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే గ్రామంలో రూ.2.10 లక్షలు పలికింది. బలిజపల్లెలో యువకులంతా వినాయకుడి మాలధారణ ధరించి ప్రత్యేక పూజలు చేశారు.

వెంకటరాజంపేట లడ్డూ రూ.1.45 లక్షలు



రాజంపేట, సెప్టెంబరు 9: మండలంలోని వెంకటరాజంపేటలో గణేశ్ లడ్డు రూ.1.45 లక్షలకు పాడి ఆ గ్రామానికి చెంది న కొమ్మినేని శ్రీనివాసులు దక్కించుకున్నారు. ఈయనను వెంకటరాజంపేట గ్రామస్థులు అభినందించారు.

నిమజ్జనంలో అపశ్రుతి

● చెరువులో ట్రాక్టర్ బోల్తా పడి బాలుడు మృతి

● పలువురికి గాయాలు




ప్రమాదంలో మృతి చెందిన అఫ్జల్ (ఫైల్)

పెద్దమండ్యం, సెప్టెంబరు 9 : గణేశ్ నిమజ్జనంలో అపశ్రుతి జరిగింది. చెరువు కట్టపై నుంచి ట్రాక్టర్ చెరువులో బోల్తాపడి బాలుడు మృతి చెందగా పలువురికి గాయాలైన సంఘటన పెద్దమండ్యం మండలంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. మండలంలోని పాపేపల్లి గ్రామ పంచాయతీ గుడిసెవారిపల్లి గ్రామంలోని వినాయక విగ్రహాన్ని ట్రాక్టర్‌లో ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని గుడిసెవారిపల్లి చెరువులో నిమజ్జనం చేశారు. ఊరేగింపులో గుడిసెవారిపల్లి గ్రామస్థులతో పాటు పి.తురకపల్లి, గురివిరెడ్డిగారిపల్లి గ్రామస్థులు, చిన్న పిల్లలు తదితరులు పాల్గొన్నారు. నిమజ్జనం అనంతరం ట్రాక్టర్ ట్రాలిలో పిల్లలు, పెద్దలు కూర్చోని తిరిగి ఇంటికి బయలుదేరారు. గుడిసెవారిపల్లి చెరువు కట్టపై ట్రాక్టర్ అదుపు తప్పి చెరువులోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పి.తురకపల్లెకు చెందిన ఎస్.మౌలా కొడుకు అఫ్జల్ (11)కు తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే పెద్దమండ్యం పీహెచ్‌సీకి తరలించగానే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని యల్లంవారిపల్లి హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. ప్రమాదంలో సంజీవ, రెడ్డి, జాఫర్‌వలీ, ఖాజా, అర్షద్, సుబహాన్, అమీన్, అర్షద్, రెడ్డిబాషా అనే వారికి గాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు. చెరువులో నీళ్లు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ములకలచెరువు సీఐ రాజారమేష్ సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయాలైన పలువురిని 108 వాహనంలో పెద్దమండ్యం పీహెచ్‌సీకి తరలించారు. బాలుడి మృతితో పి.తురకపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి.


చెరువులో బోల్తాపడిన ట్రాక్టర్

రియాద్‌లో మదనపల్లె వాసి మృతి


రియాద్‌లో మృతి చెందిన మాలిక్‌బాషా

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9: మదనపల్లె నుంచి జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లిన వ్యక్తి అక్కడే మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంసభ్యులు తెలిపిన వివరాల మేరకు... మదనపల్లె పట్టణం ప్యారానగర్‌లో ఉన్న అబ్దుల్ వహీబ్ కుమారుడు షేక్ మాలిక్ బాషా (47) కారు డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. అతడికి భార్య షబీనా, కుమార్తె కరిష్మాభాను, కుమారుడు సయ్యద్ కబీర్ ఉన్నారు. ఇటీవల కుమార్తెకు వివాహం జరిపించారు. వివాహానికి కొంత అప్పులు చేయడంతో వాటిని తీర్చడానికి నాలుగు నెలల క్రితమే రియాద్‌కు వెళ్లి అక్కడ కారుడ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. ఈ క్రమంలో తీవ్రమైన గుండె పోటు రావడంతో తెలిసిన వారు ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందించారు. కాగా పరిస్థితి తీవ్రం కావడంతో ఈనెల 3వ తేదీ మృతి చెందాడు. షేక్‌మాలిక్‌బాషా మృతి చెందిన సమాచారం మదననపల్లెలోని కుటుంబసభ్యులకు అందజేశారు. అయితే మృతదేహాన్ని అక్కడి నుంచి మదనపల్లెకు తీసుకురావడానికి వ్యయ ప్రయాసలతో కూడుకున్నది కావడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని అక్కడే ఖననం చేయడానికి అంగీకరించినట్లు ఇండియన్ ఎంబసీకి అంగీకారపత్రం పంపినట్లు వారు తెలిపారు. చివరకు కడచూపునకు కూడా నోచుకోలేకపాయామని కుటుంబసభ్యులు వాపోయారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి

చక్రాయపేట, సెప్టెంబరు 9: వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తూ అదే ట్రాక్టర్ కింద పడి ఓ బాలుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... వినాయక చవితి సందర్భంగా సోమవారం భారీ ఎత్తున వినాయక విగ్రహాల నిమజ్జనం జరిగింది. ఇందులో భాగంగా ఆంజనేయపురానికి చెందిన కొందరు విగ్రహాన్ని తీసుకుని కాలేటివాగు డ్యాం వద్దకు వెళ్లారు. అక్కడ అనుమతించకపోవడంతో కుప్పం గ్రామం సమీపంలోని పాపాఘ్నిలో నిమజ్జనం చేసి వెనుదిరిగారు. మార్గమధ్యంలో నెర్సుపల్లె క్రాస్ వద్ద చిలేకాంపల్లెకు చెందిన ట్రాక్టర్ యజమాని సత్తార్ స్పీడ్‌గా వెళ్లడంతో అందులో ఉన్న గౌతం అదుపు తప్పి కింద పడ్డాడు. అదే సమయంలో ఆదిత్య అనే వ్యక్తి గౌతం చేతిని పట్టుకునే ప్రయత్నం చేసినా కుదరలేదు. కిందపడ్డ గౌతం తలపై ట్రాక్టర్ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా.. గౌతంది మదనపల్లె వద్ద ఉన్న అంగళ్లు. ఆంజనేయపురంలోని బంధువులో ఇంటిలో ఉంటూ రాయచోటి సాయి కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కడప మీదుగా ప్రత్యేక రైలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: కేరళలో ఓనం పండుగ నేపథ్యంలో కాచిగూడ నుంచి కడప మీదుగా కొల్లంకు ప్రత్యేక రైలును ఈ నెల 14తేదీ నుంచి నడపనున్నట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు జనార్ధన్ తెలిపారు. ఈ నెల 14న సాయంత్రం 4గంటలకు కాచిగూడలో ప్రారంభమై ఎర్రగుంట్లకు రాత్రి 11.57కు కడపకు అర్ధరాత్రి 12.38కి చేరుకుంటుందన్నారు. 12.40కి బయల్దేరి రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతి మీదుగా వెళ్లి మరుసటి రోజు రాత్రి 11.20కి కొల్లం రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుందని అన్నారు. తిరుగు ప్రయాణంలో 16న కొల్లంలో తెల్లవారుజామున 2.30కి బయల్దేరి రేణిగుంటకు రాత్రి 8.20, రాజంపేట 9.29, కడపకు 10.18, ఎర్రగుంట్ల 10.43కు చేరుకుని మరుసటి రోజు ఉదయం 9.45గంటలకు కాచిగూడ చేరుతుందన్నారు.

కడప-బెంగళూరు రైల్వే లైను పనులు చేపట్టాలి

● రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి

కలికిరి, సెప్టెంబరు 9: కడప-బెంగళూరు రైల్వే లైను పనులను పునఃప్రారంభించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి డిమాండు చేశారు. సోమవారం ఆయన కలికిరిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ 2008-09 రైల్వే బడ్జెట్‌లో ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న నాటి కాంగ్రెస్ ప్రభుత్వం కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని మంజూరు చేసిందని గుర్తు చేశారు. రాయలసీమ ప్రాంతం ఉద్యాన రైతులకు, కార్మికులకు, ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లే వారి కోసం అనువుగా ఈ రైలు మార్గ అనువుగా ఉంటుందని ప్రతిపాదించారని చెప్పారు. 255.40 కి.మీ పొడవుతో నిర్మితం కానున్న ఈ రైల్వే లైను రూ.3038 కోట్ల వ్యయంతో అంచనా వేశారని తెలిపారు. నాలుగు దశల్లో ఈ రైలు మార్గాన్ని పూర్తి చేయాలని సంకల్పించారని, అందులో భాగంగా కడప నుంచి పెండ్లిమర్రి వరకూ 21.80 కి.మీ మార్గంతో మొదటి దశలో నిర్మాణం పూర్తయిందన్నారు. జగన్ సీఎంగా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మ్యాచింగ్ గ్రాంటు, భూసేకరణ పరిహారం నిధులు విడుదల చేయకుండా ఈ రైలు మార్గాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఈ రైలు మార్గం ఇప్పటికీ ఉనికిలోనే ఉందని, ప్రధాని మోదీ కూడా హామీ ఇచ్చినందువల్ల దీనిని పునఃప్రారంభించేందుకు ముందుకు రావాలని డిమాండు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు శ్రీవర్ధన్, సింగం రామకృష్ణారెడ్డి, మల్లిక, మహబూబ్‌బాషా, మంగు నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉచిత ఇసుక విధానానికి ఆదిలోనే అధికారుల తూట్లు

● ఓ కాంట్రాక్టర్‌కు ఏకంగా 150 టన్నుల ఇసుక తరలింపు?

● ఇసుక దొరక్క రైల్వేకోడూరు, రాజంపేట భవన నిర్మాణదారుల ఇబ్బందులు

● కూచివారిపల్లె సచివాలయం వద్ద కూపన్ల కోసం తొక్కిసలాట


కూచివారిపల్లె ఇసుక కౌంటర్ వద్ద ఇసుక కోసం వచ్చి తొక్కిసలాటలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రాజంపేట, సెప్టెంబరు 9: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో గత ప్రభుత్వ తప్పిదాలను సవరిస్తూ ప్రజలందరికీ ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా కొందరు అధికారులు దానిని తుంగలో తొక్కి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవిధంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అభివృద్ధి పనుల పేరిట ఉచిత ఇసుక ప్రారంభించిన రోజు నుంచే ప్రజలకు ఆ ఇసుకను ఇవ్వకుండా దొడ్డిదారిన ఓ కాంట్రాక్టర్‌కు రోజువారీ 150 టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు తెలుస్తోంది. దీనివల్ల రాజంపేట, కోడూరు నుంచి వచ్చిన ప్రజలు కూచివారిపల్లె సచివాలయం వద్ద తెల్లవారుజామున 5 గంటల నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లలో నిలబడి తొక్కిసలాట మధ్య ఈ ఇసుక వద్దురా దేవుడా అని తిరిగి వెళ్లిపోతున్నారు. వివరాల్లోకి వెళితే... ఉచిత ఇసుక విధానాన్ని 3 రోజుల క్రితం ప్రారంభించారు. రాజంపేట మండలంలోని ఆర్.బుడుగుంటపల్లె వద్ద చెయ్యేరు నదిలో 3 ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి జిల్లా అందరికీ సరఫరా చేస్తున్నారు. ఇందులో భాగంగా రాజంపేట, కోడూరు నియోజకవర్గాల ప్రజలకు కూచివారిపల్లె సచివాలయం వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసి ఇక్కడ మైనింగ్ శాఖ వారు 5 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి కూపన్లు ఇస్తున్నారు. సుమారు 60 కిలోమీటర్ల దూరం ఉండే రైల్వే కోడూరు మండలం కుక్కలదొడ్డి నుంచి చిట్వేలి, పెనగలూరు, ఓబులవారిపల్లె, పుల్లంపేట, రాజంపేట, నందలూరు, సుండుపల్లె, వీరబల్లె మండలాలకు చెందిన అనేకమంది ప్రజలు వందలాది మంది ఇసుక కోసం కూచివారిపల్లె పంచాయతీ వద్ద తెల్లవారుజాము నుంచే క్యూలైన్లలో నిలబడుతున్నారు. కూపన్ల కోసం తొక్కిసలాట జరిగినా పట్టించుకునే అధికారే లేరని వారు వాపోతున్నారు. సోమవారం కూచివారిపల్లె సచివాలయం వద్ద తోపులాట జరుగుతుండగా పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం సద్దుమణిగింది. అయితే ఇలా రోజు వారీ ఇచ్చే కూపన్లు అయిపోయాయని, రేపో ఎల్లుండో రావాలని అక్కడి వారికి ఆఖరి నిమిషంలో చెప్పేస్తుండడంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చినవారు తీవ్ర ఇబ్బందులు పడి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మామూలుగా రాజంపేట, కోడూరు నియోజకవర్గాలకు రోజువారీ 500 టన్నుల పరిమితి ఉంది. అందులో 20 ట్రాక్టర్‌లకు, 25 టిప్పర్లకు సరిపడా రోజూ ఇసుక సరఫరా చేసుకోవచ్చు. అయితే అభివృద్ధి పనుల పేరిట ఓ కాంట్రాక్టర్ చక్రం తిప్పుతూ సంబంధిత అధికారులను లోబర్చుకుని రోజువారీ ప్రజలకు ఇవ్వాల్సిన 500 టన్నుల ఇసుకలో ఏకంగా 150 టన్నుల ఇసుకను ప్రత్యేక వాహనాల్లో అతను తరలించుకుపోతున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి పేరిట తీసుకుంటున్న ఈ ఇసుకను ఇతను ఆ పనికి ఉపయోగించుకోకుండా బ్లాక్‌మార్కెట్‌లో ఇతరులకు అమ్ముతున్నట్లు సమాచారం. మామూలుగా ప్రజలకు కేటాయించాల్సిన ప్రభుత్వ నిబంధనల మేరకు 500 టన్నుల ఇసుకను ప్రజలకు నేరుగా సరఫరా చేస్తే కొద్దిమేరకైనా సమస్య తీరుతుంది. అలా కాకుండా ప్రజలకు ఇచ్చే ఇసుకలోనే 150 టన్నుల ఇసుకను ఆ కాంట్రాక్టర్‌కు ఇవ్వడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి దీనిపై దృష్టి పెట్టి సుదూర ప్రాంతాల నుంచి కౌంటర్ వద్దకు వచ్చే వారి ఆధార్‌కార్డును పరిశీలించి ఒక్కొక్కరికి ఒక్కో కూపను ఇచ్చి పంపితే ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా ఒక్కొక్కరు 4 ఆధార్‌కార్డులు తీసుకువస్తుండటంతో వారికి ఇచ్చేయడం, ప్రజలకు ఇవ్వాల్సిన ఇసుకలోనే క్రాంటాక్టర్‌కు కూడా ఇవ్వడం వల్ల ఈ సమస్య ఏర్పడుతోందని ప్రజలు తెలుపుతున్నారు. ఈ విషయంపై వివరణ కోసం సంబంధిత అధికారులకు ఫోన్ చేసినా ఎవరూ స్పందించలేదు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

● ప్రభుత్వం నిర్ణయించిన ధరకే సరఫరా ● చెక్‌పోస్టుల్లో నిఘా మరింత పెంచాలి ● కలెక్టర్ చామకూరి శ్రీధర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్) సెప్టెంబరు 9: జిల్లాలో ఇసుక అక్రమ రవాణా, తవ్వకాలను అరికట్టాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో గనుల శాఖ, రవాణా, ట్రాక్టర్, టిప్పర్ యాజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం నిర్వహణ చార్జీలు మాత్రమే వసూలు చేసి వినియోగదారులకు డిపోల ద్వారా ఇసుక సరఫరా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు పటిష్ఠంగా అమలు పరచాలని ఆదేశించారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారుల సలహాలు కూడా పరిగణలోకి తీసుకుని జిల్లాలో చెక్‌పోస్టులను మరింత కట్టుదిట్టం మైనింగ్, రవాణా, పోలీసు శాఖలను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడెక్కడ ఇసుక అక్రమంగా నిల్వలు ఉన్నాయో తెలుసుకుని గనుల శాఖ ద్వారా నోటీసులిచ్చి వాటిని స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇప్పటివరకు జిల్లాలో దాదాపు 45 వేల మెట్రిక్ టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నోటీస్ పీరియడ్ ముగిసిన తరువాత మార్గదర్శకాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ ఏడీ రవిప్రసాద్, ట్రాన్స్‌పోర్టు అధికారి భరత్, పోలీసు అధికారులు, లారీల యాజమానులు, ట్రాక్టర్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను బాధ్యతగా పరిష్కరించాలి

ప్రజల సమస్యలపై శ్రద్ధ చూపి వారి అర్జీలను క్షేత్రస్థాయిలో వెళ్లి బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని గ్రీవెన్స్‌హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పటిష్ఠంగా నిర్వహించాలన్నారు. అందిన ప్రతి అర్జీని ఎప్పటికప్పుడు నాణ్యతతో, బాధ్యతాయుతంగా వందశాతం పరిష్కరించాలని తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలో నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు. పదే పదే అర్జిదారులు కలెక్టర్ కార్యాలయానికి రాకుండా ప్రజల నుంచి వచ్చిన అర్జీలపై పూర్తి అవగాహన చేసుకుని వారి సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగస్వామి, డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా కడప పాత బస్టాండ్



- నిరుపయోగంగా బస్టాండ్ పైఅంతస్తు భవన సముదాయం
- మల మూత్ర, వ్యర్థాలతో కంపుకొడుతున్న గదులు
- చోద్యం చూస్తున్న కార్పొరేషన్... ఆర్టీసీ అధికారులు

కడప (మారుతీనగర్) సెప్టెంబరు 9: అది నగర నడిబొడ్డున గల ఆర్టీసీ పాత బస్టాండు. సుమారు 40 సంవత్సరాల నుంచి ప్రయాణీకుల సేవలో తరిస్తోంది. ప్రతిరోజూ సుమారు 300 వందలకు పైగా వివిధ డిపోలకు (కడప-మైదుకూరు-ప్రొద్దుటూరు-జమ్మలమడుగు-బద్వేల్-రాయచోటి-పులివెందుల-రాజంపేట) చెందిన బస్సులు వస్తూ పోతూ ఉంటాయి. ఆ లెక్కన ప్రతి రోజు వేలాది మంది ప్రయాణికులు బస్సులలో ప్రయాణాలు సాగించేందుకు బస్టాండులో వేసి వుండడం పరిపాటి. కార్పొరేషన్, ఆర్టీసీ అధికారుల నిర్వాకం కారణంగా గత సంవత్సర కాలంగా బస్టాండు దయనీయస్థితిలో ఉంది.



కాంప్లెక్స్ తాపలపై పడేసిన మందుబాటిళ్లు

ప్రధానంగా బస్టాండుపై అంతస్థు భవన సముదాయం అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలున్నాయి. మందుబాబులు పగలూ రాత్రి అనే తేడా లేకుండా పై అంతస్థు భవనాలలో తాగి తందానాలు అడుతున్నట్లు సమాచారం. వీరికి తోడు గంజాయి సేవించే వారు, పిట్ ప్యాకెట్‌గాళ్లు ఆ మత్తులో బస్టాండులో వున్న ప్రయాణీకుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో పాత బస్టాండులో ఔట్‌పోస్ట్ పోలీస్‌స్టేషన్ ఉండటంతో ప్రయాణికుల భద్రత ఉండేది.

సుందరీకరణకు నోచుకోని పాత బస్టాండు కాంప్లెక్స్

పాత బస్టాండు ఉందంటే.. ఉందన్నట్లుగా మారింది. అక్కడి భవనాల కాంప్లెక్స్ సముదాయం మల, మూత్ర విసర్జనకు నిలయంగా మారింది. దీనికితోడు ప్లాస్టిక్ వ్యర్థాలు, మందు బాబులు తాగి పడేసిన ప్లాస్టిక్ బాటిల్స్, గ్లాసులు, చెత్తా చెదారాలు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని సంవత్సరాలుగా బస్టాండు భవనం సుందరీకరణకు నోచుకోక అలంకారప్రాయంగా మారిందనే విమర్శలున్నాయి. బస్టాండ్‌లోని పుట్‌పాత్‌లలో కొన్ని పెచ్చులూడి ప్రమాదకరంగా వున్నాయి.

కాంప్లెక్స్ ఆదాయాన్ని గాలికొదిలేసిన కార్పొరేషన్

బస్టాండ్ కాంప్లెక్స్ గదుల సముదాయం పట్ల కార్పొరేషన్ అధికారులు ఏ మాత్రం శ్రద్ధ చూపకపోవడంతో ఆదాయం కోల్పోతుందనే విమర్శలున్నాయి. నిరుపయోగంగా వున్న కాంప్లెక్స్ భవనాలకు చిన్న చిన్న మరమ్మతులు చేసి.. ఆఫీసులకు, వ్యాపారాలకు బాడుగలకు అప్పగిస్తే కార్పొరేషన్‌కు లాభదాయకంగా వుంటుంది. ఏది ఏమైనా ఆర్టీసీ అధికారులు నెలకు రూ.70 వేలకు పైగా కార్పోరేషన్‌కు బాడుగ రూపంలో అద్దె చెల్లిస్తున్నట్లు తెలిసింది. అక్కడ బస్సుల రాకపోకలు సాగించడానికి వీలుగా... ఆర్టీసీ అధికారులు కూడా బస్టాండు స్థితిగతుల గురించి ఆరా తీయకపోవడం విడ్డూరంగా వుంది. ఇప్పటికైనా పాత బస్టాండ్ పురోగతి విషయంపై కార్పొరేన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు ప్రయాణీకులు, కాంప్లెక్స్ సముదాయ భవన వ్యాపారులు కోరుతున్నారు.



బస్టాండ్ కాంప్లెక్స్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారం, కుళ్లిపోయి కంపు కొడుతున్న వ్యర్థాలు

15లోగా ఈ-పంట, ఈ-కెవైసీ నమోదు చేసుకోవాలి

కడప రూరల్, సెప్టెంబర్ 9: ప్రభుత్వ ప్రయోజనాలు లభించాలంటే పంట వేసిన ప్రతి ఒక్కరు సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదుతో పాటు, ఈ-కెవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 2 లక్షల 10వేల ఎకరాలలో వివిధ రకాల పంటలను సాగుచేశారన్నారు. అందులో ఇప్పటి వరకు 2,06,588 ఎకరాలలో ఈ- పంట నమోదుచేసి రాష్ట్రంలోనే కడప జిల్లా ప్రథమస్థానంలో ఉందన్నారు. ఈ-పంట నమోదు వలన రైతులకు పెట్టుబడి రాయితీ, వడ్డీలేని రుణాలు, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాల వంటి ప్రయోజనాలు పొందడానికి వీలుపడుతుందన్నారు. పంటవేసిన ప్రతి రైతు సెప్టెంబర్ 15లోగా ఈ-పంట నమోదుతో పాటు, ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ- పంటలో నమోదు చేసుకోని రైతులు తమ పరిధిలోని రైతుసేవా కేంద్రం సిబ్బందిని కలిసి నమోదు చేయించుకోవాలన్నారు.

రెండురోజులుగా ఇసుక అమ్మకాలు బంద్

కొండాపురం, సెప్టెంబరు 9: మండలంలోని ఏటూరు, పి.అనంతపురం ఇసుక స్టాక్ పాయింట్లలో రెండురోజులుగా ఇసుక అమ్మకాలు బంద్ అయ్యాయి. ప్రస్తుతం ఏటూరు ఇసుకరీచ్‌లోకి గండికోట బ్యాక్‌వాటర్ చేరడం.. స్టాక్ తగినంత లేకపోవడంతో అమ్మకాలను బంద్ చేసినట్లు తెలుస్తోంది. దీంతో ప్రస్తుతం సచివాలయాల వద్ద ఇసుక కూపన్లను ఇవ్వడం లేదు. మంగళవారం నుంచి రీచ్ నుంచి స్టాక్‌పాయింట్‌కు ఇసుకను డంపింగ్ చేయనున్నట్లు తహసీల్దార్ మాధవకృష్ణారెడ్డి తెలిపారు. కాగా బుధవారం నుంచి ఆన్‌లైన్ విధానంతో పాటు, యాప్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే అవకాశం ఉంటుందని తహసీల్దార్ తెలిపారు.

రేపు అండర్-14 పురుషుల క్రికెట్ సెలక్షన్స్

కడప (స్పోర్ట్స్) సెప్టెంబరు 9. నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 11వ తేదీ బుధవారం ఉదయం 7 గంటలకు అండర్-14 పురుషుల క్రికెట్ సెలక్షన్స్ (ఎంపికలు) జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులు ఎంపికలకు తప్పక హాజరు కావాలని కోరారు. హాజరయ్యే క్రీడాకారులు తమతో పాటు ఆధార్‌కార్డు కాపీ, జనన సర్టిఫికెట్ (ఫారం-5) పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్, 3 సంవత్సరాల ప్రోగ్రెస్ రిపోర్ట్, ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, కిట్‌బ్యాగ్‌లు వెంట తీసుకురావాలన్నారు. ఎంపికలకు 2010 సెప్టెంబర్ 1 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు.

తహసీల్దారు కార్యాలయంలో ఘర్షణ

చాపాడు, సెప్టెంబరు 9: చాపాడు తహసీల్దారు కార్యాలయంలో సోమవారంసాయంత్రం 4.30 గంటల సమయంలో ఉద్యోగుల మధ్య ఘర్షణ జరిగింది. కార్యాలయంలో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ సోమశేఖర్‌రెడ్డికి పల్లవోలు గ్రామ వీఆర్‌ఏ లక్షుమయ్య జీతం విషయమై ఘర్షణ జరిగింది. ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో లక్షుమయ్యకు తల వెనుకభాగంలో గాయమైంది. లక్షుమయ్యకు సంబంధించిన కొంతమంది బంధువులు కూడా సోమశేఖర్‌రెడ్డిపై దాడి చేశారు.

రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వేంపల్లె, సెప్టెంబరు 9: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్ఎస్ కుమారస్వామి గుప్త తెలిపారు. కావ్య, బి.సువర్ణ, డి.సాయి హర్షిత, పి.వైష్ణవి, అనుశ్రీ, వి.మహబూబ్, శివ, సి.రాకేష్, ఎస్.కిషోర్, బి.మల్లెంకొండయ్య, ఎం.కృష్ణ సాయిలు ఉన్నారు. వీరిలో ఇద్దరు ఒంగోలు ట్రిపుల్‌ఐటీ విద్యార్థినిలు కాగా మిగిలిన వారు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు అన్నారు. ఈనెల 14,15న కోనసీమలో జరగబోయే రాష్ట్రస్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలలో కడప జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

నిమజ్జనంలోప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోండి : ఎస్పీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

చాపాడు, సెప్టెంబరు 9: గణేష్ నిమజ్జనం సందర్భంగా కుందూ నది బ్రిడ్జిపై భక్తులకు ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సోమవారం ఎస్పీ సీతారామపురం గ్రామం వద్ద ఏర్పాటు చేసిన గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్ని గ్రామాల నుంచి భక్తులు విగ్రహాలు తీసుకొస్తారని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌ని అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట లైట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రూరల్ సీఐ శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య పాల్గొన్నారు.

బ్ర.మఠం పోలీసుస్టేషన్ తనిఖీ

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 9: బ్రహ్మంగారిమఠం పోలీసుస్టేషన్‌ను ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తనిఖీ చేశారు. పోలీసుస్టేషన్ ఆవరణాన్ని, అనంతరం రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఆదేశాలు జారీ చేశారు. వినాయక నిమజ్జనాలను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలన్నారు. మండలంలో పేకాట, జూదం, మద్యపానం లేకుండా కట్టుదిట్టమైన చర్య లు చేపట్టాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, రూరల్ సీఐ శివశంకర్ పాల్గొన్నారు.

సీసీ పుటేజిలు బయటకు వెళ్లినందుకు సిబ్బందికి మెమోలు

చక్రాయపేట, సెప్టెంబరు 9: గండి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ అన్నదానం కార్యక్రమం సందర్భంగా జె.రెడ్డయ్య కె.రెడ్డయ్య అనే ఇరువురు వాగ్వాదం పడడంతో సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య వారిని మందలించాడు. అంతటితో వంటమాస్టర్ కె.రెడ్డయ్య ఆగ్రహానికి గురై జె.రెడ్డయ్య వాటర్‌బాటిల్‌లో విషపూరిత మందు కలిపారు. దీన్ని సీసీ పుటేజీలో గండి సిబ్బంది పరిశీలించారు. కాగా, ఆ సీసీ పుటేజీలు బయటకు వెళ్లాయి. దీనిపై సిబ్బందికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. 24గంటల్లో సమాధానం ఇవ్వాలని.. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య కె.రెడ్డయ్యపై ఫిర్యాదు చేశారు.

వైవీయూను సందర్శించిన ఇంటాక్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: వైవీయూను ఇంటాక్ జిల్లా ప్రతినిధులు సందర్శించారు. ఆర్ట్స్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. బొటానికల్ గార్డెన్, జైయింట్ వాటర్‌లిల్లి అనేక రకాల మొక్కలను పరిశీలించారు. అనంతరం వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డిని ఆయన చాంబరులో కలిసి ముచ్చటించారు. విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రత్యేకతలను తెలుసుకున్నారు. లలిత కళలశాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయారావు, ఇంటాక్ జిల్లా చాప్టరు కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతి నిధులు పోతుల వెంకట్రామిరెడ్డి, సంజీవరెడ్డి, బాల యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన వీసీ



పీజీ ప్రవేశాల ప్రక్రియను పరిశీలిస్తున్న రిజిస్ట్రారు, వీసీ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: వైవీయూ పీజీ కళాశాల ప్రవేశాల ప్రక్రియను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు రఘునాథరెడ్డిలు పరిశీలించారు. ఏపీ పీజీసెట్‌లో అర్హత సాధించి వైవీయూలో సీటు పొందిన వారు సంచాలకుల కార్యాలయానికి వచ్చారు. బీవోఏ సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మార్గదర్శకంలో విద్యార్థుల అర్హత పత్రాలు పరిశీలన చేసి సీట్లను కేటాయిస్తున్నారు. వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్లు విద్యార్థులతో మాట్లాడారు. ఇబ్బందుల గురించి ఆరా తీశారు. లక్ష్మీప్రసాద్ స్పందిస్తూ తొలివిడతలో 363 మంది విద్యార్థులు వైవీయూ కళాశాలకు ఆప్షన్స్ ఇచ్చుకున్నారని.. అందులో 262 మంది ఇప్పటికే ప్రవేశాలు పొందారన్నారు. ఈనెల 4 నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీవోఏ సలహా సహాయ సంచాలకులు రామక్రిష్ణ, డాక్టర్ మునికుమారి, డాక్టర్ వసూ గోవర్ధనరెడ్డి, రెడ్డయ్య, డాక్టర్ గణేశ్‌నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మైలవరం నుంచి పెన్నాకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

మైలవరం, సెప్టెంబరు 9: మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి సోమవారం నుంచి రోజు రోజుకు నీటి విడుదల పెంచనున్నట్లు మైలవరం జలాశయ ఏఈఈ గౌతమ్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం జలాశయం నుంచి గండికోట జలాశయానికి.. అక్కడి నుంచి మైలవరం జలాశయానికి నీరు వచ్చి చేరుతుండటంతో పెన్నానదికి నీటి విడు దల పెంచనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా.. సోమవారం సాయంత్రం నుంచి 1000 క్యూసెక్కుల నీటిని పెన్నాకు విడుదల చేస్తున్నారు. అలాగే 10వ తేదీ మంగళవారం సాయంత్రం నుంచి 1000 నుంచి 3000 క్యూసెక్కుల నీటిని పెంచనున్నామని, 11వ తేది బుధవారం సాయంత్రం నుంచి 3000 నుంచి 5000 క్యూసెక్కులు, 12వ తేది గురువారం సాయంత్రం 5000 నుంచి 8500 క్యూసెక్కుల నీటిని విడుదల జరుగుతుందని.. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జలాశయ అధికారులు తెలిపారు. మైలవరం జలాశయం పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 6.500 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.500 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెన్నా నదికి నీటిని విడుదల చేస్తున్నామని రెవె న్యూ అధికారులు, పోలీసులు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు.

ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధిస్తా..

- అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్



నాగరాజును సన్మానిస్తున్న దృశ్యం

వీరబల్లి, సెప్టెంబరు 9: ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు సాధించి భారతదేశానికి అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకొస్తానని అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ కొర్లగుంట నాగరాజు అన్నారు. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 74 కిలోల విభాగంలో 390 కిలోల బరువును ఎత్తి గోల్డ్ మెడల్‌ను సాధించిన నాగరాజును సోమవారం వీరబల్లిలోని ఎస్డీకేఆర్ డిగ్రీ కళాశాలలో వీఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో విజయం సాధించి గోల్డ్ మెడల్‌ను సాధించడం హర్షించదగ్గ విషయమని ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజంతుల్లా మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి నాగరాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, ఎస్డీకేఆర్ కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ సర్పంచ్ అవినీతిపై విచారణ



వివరాలు తెలుసుకుంటున్న విచారణ అధికారులు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 9: బద్వేలు మండలం చింతలచెరువు పంచాయతీ సర్పంచ్ ఆరెళ్ల పద్మావతి, ఉప సర్పంచ్ నాగిరెడ్డి రవి కుమార్‌రెడ్డిలు పంచాయతీ కార్యదర్శులతో కలిసి అవినీతికి పాల్పడ్డారని బయనపల్లె గ్రామానికి చెందిన బిజివేముల వెంకట సుబ్బారెడ్డి స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు సోమవారం బద్వేలు ఈవోపీఆర్‌డీ ఆదినారాయణ, అట్లూరు ఈవో ఎఆర్‌డీతో కలిసి విచారణ చేపట్టారు. పంచాయతీ తీర్మానాలు లేకుండానే నిధులు వాడుకోవడం.. పనులు చేయకుండా నిధులు కాజేసినట్లు ఫిర్యాదుదారుడు వెంకటసుబ్బారెడ్డి గతనెల 18న స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. జరిగిన పనులకు సంబంధించిన ఎం బుక్‌లను సమాచార హక్కు చట్టం ద్వారా అడిగితే తమ వద్ద లేదంటూ పంచాయతీ సెక్రటరీ తిమ్మయ్య ఇచ్చిన సమాధాన పేపర్లను అధికారులకు చూపించినట్లు తెలిపారు. అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు వార్డు మెంబర్ల ఇళ్లకు వెళ్లి తీర్మానాల బుక్‌లో పంచాయతీ సెక్రటరీ సంతకాలు తీసుకుంటున్నారని.. గడిచిన మూడేళ్లలో చింతల చెరువు పంచా యతీలో రూ.20 లక్షలకు పైగా అవినీతి జరిగిందని.. సమగ్ర విచారణ జరపాలని అధికారులను కోరినట్లు ఫిర్యాదుదారుడు తెలిపారు. కాగా, పంచాయతీ కార్యదర్శి రికార్డులను సమర్పించేందుకు కొంత సమయం కావాలని విచారణ అధికారులను అడగడంతో.. ఈ నెల 13 వరకు విచారణ వాయిదా వేసినట్లు తెలిపారు.

288 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 9: ఎర్రగుంట్లలోని వినాయకనగర్ సమీపంలో సోమవారం కడప విజిలెన్స్ ఆధ్వర్యంలో దాడి చేసి 288 బస్తాల రేషన్ బియ్యం పట్టుకున్నారు. కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వారి ఆదేశాలతో ఏపి 16 టీజే 6219 నెంబరు గల లారీలో రేషన్ బియ్యం రవాణా చేస్తున్నారని సమాచారం రావడంతో దాడి చేశారు. లారీని తనిఖీ చేయగా 288 బస్తాల పీడీఎస్ బియ్యంను గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.15,92,612 ఉంటుందన్నారు. లారీని ఎర్రగుంట్ల పోలీసులకు, బియ్యాన్ని ప్రొద్దుటూరు ఎంఎల్ఎస్ వారికి అప్పగించినట్లు తెలిపారు. ఎర్రగుంట్ల మండలానికి చెందిన మందాల శివనాగేంద్ర, మందాల మహేష్‌ను అరెస్టు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ జి.బాషా, ఎర్రగుంట్ల డీటీ తేజస్వి, ఏవో బాల గంగాధర్‌రెడ్డి, ఎఫ్ఆర్‌వో మురళీక్రిష్ణ, ఆర్ఐ రమణారెడ్డి, పోలీసులు, పాల్గొన్నారు. రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, నిలువఉంచినా, అమ్మినా నేరమని.. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారి శ్రీనివాసరావు ప్రకటన చేశారు.



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్న డీటీ, ఇతర అధికారులు

బాబు అరెస్ట్ జగన్ పతనానికి నాంది

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు



విలేకరులతో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రాజు

రాజంపేటటౌన్, సెప్టెంబరు 9: చంద్రబాబును ఇబ్బందులకు గురి చేయాలన్న దురుద్ధేశ్యంతో ఆ నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తప్పుడు కేసులు బనాయించి అరెస్ట్ చేశారు. ఆ నాటి నుంచే వైసీపీ ప్రభుత్వ పతనానికి నాంది పలికిందని పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నిజాయితీ రాష్ట్ర ప్రజలకు తెలుసని, అందుకే ప్రజలు కసితో చిత్తు చిత్తుగా వైసీపీని ఓడించారని తెలిపారు. నేడు విజయవాడ తుఫాను కారణంగా వరదలను దీటుగా ఎదుర్కొంటూ ప్రజలకు భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఇడమడకల కుమార్, గుల్జార్‌బాషా, కోవూరు సుబ్రమణ్యంనాయుడు, దగ్గుపాటి సుబ్రమణ్యంనాయుడు, కౌన్సిలర్లు తుపాకుల అశోక్‌కుమార్, రాజేష్, సర్పంచ్ కోటయ్యనాయుడు, పీరుసాహెబ్, తదితరులు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి : వాల్మీకి సంఘం

లక్కిరెడ్డిపల్లె, సెప్టెంబరు 9: మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లెలో వాల్మీకి ముదిరాజ్ సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని సోమవారం తహసీల్దార్ లక్ష్మీప్రసన్నకు వాల్మీకి ముదిరాజ్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, సంఘం నాయకులు విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి మద్దుల రామచంద్రయ్య, బీజేపీ కృష్ణ, మూగి వెంకట్రమణలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణయ్య, ఆదిశేఖర్, విశ్రాంత ఉపాధ్యాయుడు ఆదినారాయణ, నాగరాజు, రామాంజనేయులు, నాగభూషణం, యోగాంజనేయులు, బాలు, మల్లయ్య, మహేశ్, శ్రీనివాసులు, రాజా తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి...

గాలివీడు, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని స్థానిక పెద్దూరు బ్రాహ్మణ వీధిలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మరుగుదొడ్ల నిర్మాణానికి తగిన స్థలం కేటాయించాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భాగ్యలతను కలిసిన కమిటీ సభ్యులు దేవాలయంలో మౌలిక వసతుల కల్పనకై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయంలో మరుగుదొడ్లు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేగాక అర్చకులు ఉండటానికి, వివాహాలు చేసుకునే సమయంలో వధూవరులు ఉండటానికి సరైన గదులు లేక ఇబ్బంది పడుతున్నందున తగిన స్థలం కేటాయించాలన్నారు. అందుకు సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ స్థల కేటాయింపును పరిశీలించాలని వీఆర్‌వోను ఆదేశించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రిషికేశ్, హరిక్రిష్ణ, వీరారెడ్డి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుతో బీజేపీ బలోపేతం

● అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్

సుండుపల్లె, సెప్టెంబరు 9: సభ్యత్వ నమోదుతో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ రామాజగదీశ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వ నమోదుకు స్పందన వస్తుందని తెలియజేశారు. స్వచ్ఛందంగా ప్రజలు బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచరాయుడు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుబ్బరాజు, రెడ్డెయ్య, అంజనేయులు, నాగమునెయ్య, గోపాల్‌రాజు, సత్యంనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దౌర్జన్యంగా మా భూమిని ఆక్రమించారు

● ఓ వృద్ధురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు



బాధితురాలు రెడ్డెమ్మ

రాయచోటి(కలెక్టరేట్), సెప్టెంబరు 9: తన భూమిని ఆక్రమించారంటూ ఓ వృద్ధురాలు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఆమె వివరాల మేరకు.. కలకడ మండలం నడిమిచెర్ల వడ్డేపల్లికు చెందిన బత్తుల రెడ్డెమ్మ(67) అనే తాను ఇదే గ్రామంలో 2009లో సర్వేనెంబర్ 391-ఎ 0.45 సెంట్లు భూమిని కొనుగోలు చేశానని, అయితే వృత్తి రీత్యా తన కుమారులు బయట వుండడంతో తాను కూడా వారివద్దే ఉన్నానని తెలిపారు. ఇదే అదునుగా చూసుకొని వెంకటస్వామి, రెడ్డెన్న అనే వారు తన పొలాన్ని ఆక్రమించారంటూ వాపోయింది. తనకు తగిన న్యాయం చేయాలని కోరింది.



పుల్లంపేటలో నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు



మేకావారిపల్లె ఉత్సవాల్లో పాల్గొన్న బాలసుబ్రమణ్యం



సిద్దవటం పెన్నానది వద్ద పర్యవేక్షిస్తున్న ఏఎస్పీ జి.వెంకటరాముడు



పెనగలూరులో నిమజ్జనానికి వెళ్తున్న గణనాథుడు



రాయచోటిలోని గణేశ్‌నగర్‌లో వినాయకుని విగ్రహం వద్ద పూజల్లో ప్రసాద్‌బాబు

బైబై గణేశా

● ఘనంగా నిమజ్జనోత్సవాలు ● పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 9: జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని 9 గ్రామ పంచాయతీలో 16 వినాయకుడి విగ్రహాల నిమజ్జన కార్యక్రమం జరిగింది. మున్సిపాల్టీతో పాటు మండల వ్యాప్తంగా 219 విగ్రహాలను భక్తులు ఏర్పాటు చేయగా, మూడవ రోజు 16 విగ్రహాలు మాత్రమే నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అన్నదానం పుణ్య కార్యం: ప్రసాద్‌బాబు

అన్నదానం పుణ్య కార్యక్రమమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు ప్రసాద్‌బాబు అన్నారు. చవితి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆయన పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల సరస్వతినగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. అలాగే పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల గణేశ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద గీతా రాంప్రసాద్, కుప్పం బాలయ్య, కుప్పం నాగరాజల ఆహ్వానం మేరకు వినాయకుడి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో మహేశ్, ఓట్స్ మనీ, రామాంజి, వెంకటేశ్, నరేశ్, బాబ్జి, చంద్రశేఖర్, ప్రభు, రెడ్డి, రంతుల్లా, ముజాహిద్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటటౌన్: రాజంపేట పట్టణంలో పలు వీధుల్లో గణనాథులను భక్తులు భక్తిశ్రద్ధలతో పూజించారు. సోమవారం పట్టణంలోని బసినాయుడుగారిపల్లెలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే సాయినగర్, మన్నూరు, నూనెవారిపల్లెలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. మార్కెట్‌లో స్వామివారి లడ్డూను రూ.70 వేలకు హరికిషోర్‌రెడ్డి దక్కించుకున్నారు.

ఉత్సవాల్లో పాల్గొన్న సుగవాసి

మండలంలోని పలు వినాయకచవితి ఉత్సవాల్లో రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు. అగ్రహారం, మేకావారిపల్లె, బసినాయుడుగారిపల్లె ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయకస్వామి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను భారీ గజమాలలు వేసి మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రైల్వేకోడూరు: పోలీసు బందోబస్తు నడుమ సోమవారం వైభవంగా గణేష్ నిమజ్జనాలు చేశారు. రైల్వేకోడూరుకు చుట్టూ ఉన్న నదుల్లో నీరు లేకపోవడంతో పోలీసులు మంగంపేట వద్ద ఉన్న చెరువుల్లో నిమజ్జనాలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. దీంతో చాలా మంది మూడోవ రోజున ఊరేగింపుగా తీసుకుని వెళ్లి మంగంపేట చెరువుల్లో నిమజ్జనాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ వెంకటేశ్వర్లు బందోబస్తు నిర్వహించారు.

గణనాథుడికి పంతగాని పూజలు

పట్టణంలోని లక్ష్మీనగర్, కొత్తబజారు, డాల్ఫిన్‌డేల్, నరసరాంపేట తదితర వీధుల్లో వినాయక స్వామి మండపాల్లో సోమవారం టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. బెజవాడను వణికించిన వరద నీటి ప్రవాహం తగ్గిపోవాలని, అక్కడి ప్రజలు వరదనీటి ప్రవాహం నుంచి భయటపడాలని స్వామివారిని కోరుకున్నట్లు తెలిపారు.

పెనగలూరు: మండలంలోని పలు గ్రామాల్లో గణనాథులను నిమజ్జనానికి పంపి ఘనంగా వీడ్కోలు పలికారు. మండల వ్యాప్తంగా 70 శాతం విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లినట్లు పోలీసులు తెలిపారు. కొండూరు, పెనగలూరు, సింగారెడ్డిపల్లె, సిద్దవరం, సింగనమల, నల్లపురెడ్డిపల్లె తదితర గ్రామాల్లోని విగ్రహాలను నర్సింగరాజపురం సమీపంలోని చాపలవారిపల్లె మడుగులో నిమజ్జనం చేశారు.

చిట్వేలి: చవితి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా అన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఎస్ఐ రఘురాం, సిబ్బంది పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు.

పుల్లంపేట: మండలంలో చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను మూడోరోజైన సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. కొన్ని ప్రాంతాల్లో వినాయక ప్రతిమల వద్ద అన్నదాన కార్యక్రమం చేశారు. ఉత్సవాలను మంగంపేటలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.

సిద్దవటం: సిద్దవటం పెన్నానదిలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. నిమజ్జనాన్ని ఏఎస్పీ జి.వెంకటరాముడు పర్యవేక్షించారు. సిద్దవటం, అట్లూరు, బద్వేల్, ఒంటిమిట్ట సమీపంలోని కొన్ని గ్రామాల నుంచి కడప తదితర ప్రాంతాల నుంచి మూడో రోజు నిమజ్జనానికి వచ్చిన గణపతి ప్రతిమలను నిర్వాహకులు పెన్నానది హైలెవల్ వంతెన నుంచి క్రేన్ సహాయంతో నిమజ్జనం చేశారు. ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్, సిద్దవటం ఎస్ఐ చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. తహసీల్దారు మురాషావలి, ఎంపీడీవో జవహర్‌బాబు, సిద్దవటం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, వీఆర్వో చెన్నకేశవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నందలూరు: మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ ఆర్‌ఎస్‌రోడ్డు వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ టీం ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ వైద్యులు హీరేంద్రసింగ్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అదేవిధంగా నీలిపల్లె రోడ్డులోని గణేష్‌నగర్ వద్ద ఈశ్వరయ్య, లోకేష్ ఆధ్వర్యంలో, నీలిపల్లె గ్రామంలో వినాయకస్వామి ఆలయం వద్ద లక్ష్మీదేవి, వెంకటరమణ, శ్రీలక్ష్మీ భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

రామాపురం: మండల కేంద్రం, కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్తపల్లె, చిట్లూరు పంచాయతీ చెనిక్కాయలపల్లెలో సోమవారం వినాయక నిమజ్జనాలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. చవితి సందర్భంగా పలు గ్రామాల్లోని ప్రజలు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తిభావంతో పూజలు నిర్వహించి టెంకాయలు సమర్పించారు.

చెరువులను పరిశీలించిన ఎస్ఐ

మండలంలో చవితి సందర్భంగా విగ్రహాల నిమజ్జనానికి గ్రామ చివరలో ఉన్న చెరువులను సోమవారం రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలను నిమజ్జనం జరిగేటప్పుడు కమిటీ సభ్యులు దగ్గర ఉండి జాగ్రత్తగా చూసుకోవాలన్నారు.

సంబేపల్లె: మండల వ్యాప్తంగా గణనాథులను మూడవ రోజు నిమజ్జనం చేశారు. పెద్దజంగంపల్లి, పెద్దకోడివాండ్లపల్లె, చిన్నజంగంపల్లితో పాటు పలు చోట్ల నిర్వహించారు. మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం ప్రత్యేక పూజలు చేపట్టారు. యువత ఉట్టి కొట్టే కార్యక్రమాలను ఉత్సాహంగా జరుపుకున్నారు. పెద్దజంగంపల్లి వినాయకుడిని లడ్డు వేలంపాటను నిర్వహించారు.



కోడూరులో పూజలు చేస్తున్న నరసింహప్రసాద్



కోడూరులో చెరువు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది



చిట్వేలిలో నిమజ్జనానికి తరలిస్తున్న బొజ్జగణపయ్య



నందలూరు ఆర్‌ఎస్‌రోడ్డులో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం



రాజంపేటలో వినాయక నిమజ్జనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

మట్టి అక్రమ రవాణాను ఆపాలి

● కలెక్టర్, తహసీల్దార్, సీఐకు ఫిర్యాదు



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కూటమి నేతలు

సుండుపల్లె, సెప్టెంబరు 9: మట్టి అక్రమ రవాణాను ఆపాలని, గుట్టలను కాపాడాలని కూటమి నేతల ఆధ్వర్యంలో కలెక్టర్ శ్రీధర్, రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, తహసీల్దార్ ద్వివాదీనంకు టీడీపీ మండల అధ్యక్షుడు కళ్లే రెడ్డెప్ప సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఆదివారం రాత్రి భాగంపల్లి గ్రామ పంచాయతీ గుర్రప్పచెరువు సమీపంలోని గుట్టల నుంచి మట్టి అక్రమ రవాణాకు ప్రయత్నించారన్నారు. ఎటువంటి అనుమతులు లేకపోయినా అక్రమ రవాణాకు ప్రయత్నించడంతో గ్రామస్తులు అడ్డుకున్నట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం మట్టి తరలించే ప్రయత్నాలను అడ్డుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ బెల్లాల రమణ, మోహన్‌బాబునాయుడు, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్లునాయుడు, నాగసుబ్బయ్య, శివరాంనాయుడు, చంద్రమౌళి, జనసేన మహిళా నాయకురాలు రెడ్డిరాణి పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి డిమాండ్

సంబేపల్లె, సెప్టెంబరు 9: కొత్త పీఆర్‌సీ అమల్లోకి వచ్చేంతవరకు ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతిని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు అంకం శివారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సంబేపల్లె ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త పీఆర్‌సీ కోసం కమిటీని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలన్నారు. గత ప్రభుత్వం నిలుపుదల చేసిన పీఎఫ్, ఏపీజీఎల్ఐ, పదవీ విరమణ ప్రయోజనాలు, సంపాదిత సెలవుల నగదు చెల్లింపు వంటి పాత బకాయిలను చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ స్టేట్ కౌన్సిలర్ మురళి, డిస్ట్రిక్ కన్వీనర్ వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శి రాజారెడ్డి, సంఘ నాయకులు దామోదర్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ధనుంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గణనాథుడి సేవలో దొడ్డపనేని కుటుంబం

కడప(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 9: కడప నగరం ఎన్జీవో కాలనీలోని గణేశ విగ్రహం వద్ద దొడ్డపనేని కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. అనంతరం దొడ్డపనేని రాజా, చంద్రశేఖర్‌నాయుడు కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానించి సత్కరించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మధుసూదనరెడ్డి, హేమంత్ నాయుడు, రాంప్రసాదరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



దొడ్డపనేని కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కమిటీ పెద్దలు

ఎక్సకవేటర్లతో గుట్ట చదును

● అడ్డుకున్న రెవెన్యూ సిబ్బంది

సుండుపల్లె, సెప్టెంబరు 9: గుట్ట ఆక్రమణలకు గురవుతోందన్న కూటమి నేతల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకున్నారు. మండలంలోని జి.రెడ్డివారిపల్లె, భాగంపల్లి గ్రామ పంచాయతీల మధ్యలో సుంకరవాండ్లపల్లె, కనంగుట్ట ఆక్రమణలను అడ్డుకున్నారు. కూటమి నాయకులు మాట్లాడుతూ యథేచ్ఛగా గుట్టలు ఆక్రమణలకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల నుంచి గుట్టను చదును చేస్తుంటే సోమవారం తూతూ మంత్రంగా నిలపడం బాధాకరమన్నారు. కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అక్కడ నుంచి జేసీబీ, ట్రాక్టర్లను పంపించారు. అయితే స్థానికంగా జేసీబీతో చదును చేయిస్తున్న వ్యక్తి పట్టా భూమి అని చెప్పారని, సర్వే చేయించి ప్రభుత్వ భూమా, పట్టా భూమి అనేది తేల్చేంతవరకు చదును చేయకూడదని అధికారులు ఆదేశించారు.

వరద బాధితులకు అండగా నిలుద్దాం

● విరాళాల సేకరణలో మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు 9: చేయి చేయి కలుపుదాం.. వరద బాధితులకు అండగా నిలుద్దామని మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు వారి ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణ కార్యక్రమాన్ని లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జల విలయంతో అల్లాడిన విజయవాడ వరద బాధితులను తమవంతుగా ఆదుకునేందుకు రాయచోటి ప్రాంతానికి చెందిన ప్రైవేటు విద్యాసంస్థలు, వ్యాపారస్తులు, వివిధ వర్గాల ప్రజలు మానవత్వంతో ముందుకు రావాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. వరద బాధితుల సహాయర్థం శ్రీలేఖ గార్మెంట్స్ ప్రొప్రైటర్ పుష్పరాజు రూ.50 వేలు విలువ చేసే నూతన వస్త్రాలను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పలు విద్యాసంస్థల అధినేతలు, పలువురు వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్రస్వామి పల్లకీ ఉత్సవం

రాయచోటిటౌన్, సెప్టెంబరు 9: పట్టణంలో వెలిసియున్న భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం పల్లకీ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రోచ్చారణల మధ్య వీరభద్రుడి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పల్లకీ ఉత్సవంపై ఊరేగుతున్న వీరభద్రుడిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

రాయచోటిలో 'సత్యా షోరూం'



షోరూం ప్రారంభోత్సవ దృశ్యం

రాయచోటి, సెప్టెంబరు 9: రాయచోటిలో సత్యా ఏజెన్సీస్ వారి 31వ షోరూం ఏర్పాటైంది. దీనిని ఆ భవన యజమాని ప్రసాద్ రిబ్బన్ కత్తిరించి సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సత్యా తిరుపతి జోన్ డీజీఎం గంగాధర్, ఉదయ్, ప్రముఖ బ్రాండ్‌ల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన విద్య

● జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

సుండుపల్లె, సెప్టెంబరు 9: ప్రభుత్వ బడులలో విద్యార్థినీ, విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తేనే ప్రభుత్వ బడులు మరింత బలోపేతం అవుతాయని ఎంఈఓలు వెంకటేశ్‌నాయక్, రవీంద్రనాయక్‌లు తెలిపారు. సోమవారం మండలంలోని రాయవరం ప్రాథమిక పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మూడే సిద్దునాయక్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ బడుల్లో మెరుగైన విద్యను ఉపాధ్యాయులు అందిస్తున్నారని, విద్యార్థులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తెలియజేశారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల విద్యా అవకాశాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమ్మునాయక్, పార్వతమ్మ, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు నాగరాజునాయక్, ఎస్టీయూ నాయకులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఆరీఫుల్లా, ఉపాధ్యాయులు శ్రీరాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

రేపు పి.కొత్తపల్లెకు జబర్దస్త్ టీం రాక

పెనగలూరు, సెప్టెంబరు 9: మండల కేంద్రంలోని పి.కొత్తపల్లెలో జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించేందుకు జబర్దస్త్ టీం రానున్నట్లు పి.కొత్తపల్లి గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాలను మండల ప్రజలే కాకుండా ఇతర మండలాల ప్రజలు కూడా పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా బి.కొత్తపల్లి గ్రామ ప్రజలు కోరారు.

రెండు బైకులు ఢీ - ఇరువురికి గాయాలు

చిట్వేలి, సెప్టెంబరు 9: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనానికి తరలివెళ్తున్న ఇరువురికి గాయాలయ్యాయి. ఈ మేరకు మూడు రోజుల పాటు పూజలందుకుని సోమవారం బొజ్జ గణపయ్య విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. ఈ క్రమంలో మండల పరిధిలోని కొత్తపల్లె వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో చెర్లోపల్లికు చెందిన రాము అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ రఘురాం ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కాణిపాక ఆలయ పవిత్రతను కాపాడండి

● మాజీ మంత్రి గల్లా అరుణకుమారి

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 9: జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వినాయక స్వామి ఆలయ పవిత్రతను కాపాడాలని మాజీ మంత్రి గల్లా అరుణకుమారి కోరారు. ఈ మేరకు సోమవారం ఆమె దిగువమాఘం నుంచి ప్రెస్‌నోట్ విడుదల చేశారు. నిత్యం వేలాది మంది స్వామి దర్శనార్థం విచ్చేసే క్షేత్రంలో.. భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా భక్తి భావం పెంపొందేలా ఆలయ పరిసరాలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్నప్పుడు కాణిపాక ఆలయం నుంచి ఆర్చి వరకు ఎలాంటి రాజకీయ, వ్యాపార ప్రకటనలు లేకుండా తీర్మానం చేయించి, అమలు చేశామని గుర్తుచేశారు. ఇప్పుడు అగరంపల్లె ఆర్చి నుంచి ఐరాల క్రాస్ రోడ్డు వరకు వివిధ పార్టీల నాయకుల ఫ్లెక్సీలు, ప్రకటనలతో నిండి ఉన్నాయన్నారు. దీనిపై ఆలయ అధికారులు, పోలీసులు, ప్రభుత్వ అధికారులు పట్టించుకోక పోవడం బాధాకరమని పేర్కొన్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్, ఆలయ అధికారులు స్పందించి బ్యానర్లను తొలగించి భక్తులలో భక్తి భావం పెంపొందేలా చూడాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 9: ప్రభుత్వ బడుల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం ద్వారా పిల్లలకు రుచికరమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. మెనూ మార్పులపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించాలని సూచించారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యుల నుంచి మెనూ మార్పు పట్ల సలహాలు, సూచనలు రెండు రోజుల్లో సేకరించాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో దేవరాజు, ఎస్ఎస్ఏ ఏపీసీ వెంకటరమణారెడ్డి, ఎంఈవోలు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మద్యం మాన్పించే పేరుతో మోసం చేసిన వ్యక్తికి జైలుశిక్ష



నాగరాజ్

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 9: మద్యం మాన్పిస్తానని అధిక మోతాదులో నాటుమందు ఇచ్చిన వ్యక్తికి చిత్తూరు న్యాయస్థానం ఐదేళ్ల జైలుశిక్ష విధించింది. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలైకు చెందిన నాగరాజ్ చిత్తూరులోని కామేశ్వర్ నగర్‌లో లైఫ్‌కేర్ పేరిట రీహేబిలిటేషన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. మద్యం పూర్తిగా నిలిపేందుకు తమ వద్ద నాటుమందు ఉందని ప్రచారం చేశాడు. ఈ క్రమంలో చిత్తూరు శ్రీనివాసనగర్‌కు చెందిన ఆశ తన కుమారుడు తరుణ్‌ను లైఫ్‌కేర్ సెంటర్‌కు తీసుకెళ్లింది. ఎక్కువ మోతాదులో మందు ఇవ్వడంతో 2022 డిసెంబరు 5వ తేదీన తరుణ్ మృతిచెందాడు. ఆశ ఫిర్యాదు మేరకు చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి, నాగరాజ్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు సోమవారం చిత్తూరు ఏఎస్‌జే కోర్టులో విచారణకు రాగా, నేరం రుజువు కావడంతో నాగరాజుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.రెండువేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి వెన్నెల తీర్పుచెప్పారు. ఈ కేసును ఏపీపీ స్వాతి వాదించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరు అరెస్టు

గుడుపల్లె, సెప్టెంబరు 9: కర్ణాటక నుంచి గుడుపల్లె మీదుగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సోమవారం రాత్రి కర్ణాటక సరిహద్దులోని బిసానత్తం సమీపంలోని ఆవుల చెరువు రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. బిసానత్తం మురళీకృష్ణ కర్ణాటక నుంచి ద్విచక్ర వాహనంలో వస్తుండగా ఆపారు. అతడు వాహనాన్ని వదిలి పారిపోవడానికి ప్రయత్నించగా పట్టుకొన్నారు. అతడి వద్ద ఉన్న సంచిని పరిశీలించగా అందులో 96 కర్ణాటక మద్యం ప్యాకెట్లు ఉన్నాయి. మద్యాన్ని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

అన్నపై తమ్ముడు కత్తితో దాడి

పుంగనూరు రూరల్, సెప్టెంబరు9: ఆస్తి కోసం అన్నను తమ్ముడు కత్తితో పొడవడంతో అన్న ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.. చౌడేపల్లె మండలం ఏ.కొత్తకోటకు చెందిన లింగప్ప కుమారులు నాగరాజ, చంద్రమౌళి. వీరు ఆస్తి కోసం సోమవారం ఉదయం ఘర్షణ పడ్డారు. అన్న నాగరాజపై తమ్ముడు చంద్రమౌళి కత్తితో దాడి చేయడంతో అతడు గాయపడ్డాడు. నాగరాజును కుటుంబసభ్యులు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కూల్‌డ్రింక్ షాపులో మద్యం విక్రయం..

యజమాని అరెస్టు

కల్లూరు, సెప్టెంబరు 9: కూల్‌డ్రింక్ షాపులో మద్యం విక్రయిస్తున్న యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.9వేలు విలువైన 60 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్ఐ రాజారెడ్డి కథనం మేరకు.. రహస్య సమాచారం మేరకు కల్లూరులోని శ్రీరాములుకు చెందిన కూల్‌డ్రింక్ దుకాణంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 60 మద్యం బాటిళ్ల పట్టుబడ్డాయి. దుకాణం యజమానిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ననియాలలో ఎస్పీ



రామకుప్పం, సెప్టెంబరు 9: రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంపును, ఎకోటూరిజం పార్కును సోమవారం ఎస్పీ మణికంఠ దంపతులు సందర్శించారు. అక్కడ కుంకీలు (శిక్షణ పొందిన ఏనుగులు) జయంత్, వినాయక్‌తో సరదాగా ఫొటోలు దిగారు. రామకుప్పం శివార్లలోని వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహక కమిటీ పెద్ద సీతాపతి తదతరులు ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం జామియా మసీదును సందర్శించారు. అక్కడ ముస్లిం పెద్దలు మహ్మద్‌రఫీ, హనీఫ్, అక్బర్, నియాజ్, ఆదిల్, నిసార్, సనావుల్లా తదితరులు వీరిని సత్కరించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 81,178 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.25,643మంది తలనీలాలు సమర్పించారు.

శ్రీపద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శశికళ

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9: శ్రీపద్మావతమ్మ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.శశికళను నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అదనపు ప్రిన్సిపాల్‌గా ఉన్న ఈమె ప్రస్తుతం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు పూర్తి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది.

రేషన్ బియ్యం స్వాధీనం : ఒకరి అరెస్టు



గుడుపల్లె, సెప్టెంబరు 9: గుడుపల్లె మండలం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. సోమవారం మధ్యాహ్నం కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని చప్పిడి గరిగెలు క్రాస్‌లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. అటుగా వచ్చిన లగేజి ఆటోను తనిఖీ చేశారు. 20 గోతాల్లో 960 కిలోల బియ్యం ఉండగా గుర్తించారు. ఆటోలోని వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా అతడ్ని పట్టుకున్నారు. నిందితుడు శాంతిపురం మండలం అబకలదొడ్డి చెందిన నరేంద్రగా గుర్తించారు. ఇతడు కుప్పం మండలంలోని పలు గ్రామాలు, సరిహద్దులోని ఉన్న తమిళనాడు గ్రామాల నుంచి రేషన్ షాపులో బియ్యాన్ని తీసుకొని కర్ణాటక రాష్ట్రం బంగారుపేటలో అమ్ముతున్నట్లు విచారణలో తేలింది. అతడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

గ్రానైట్ లారీ పట్టివేత



గుడుపల్లె, సెప్టెంబరు 9: శాంతిపురం మండలం నుంచి గుడుపల్లె మండలం మీదుగా తమిళనాడుకు అక్రమంగా గ్రానైట్‌ను తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకొన్నారు. పట్టుబడిన లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకొని, ఒకరి అరెస్టు చేశారు. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గుడుపల్లె మండలం మీదుగా గ్రానైట్ అక్రమ రవాణా అవుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. దీంతో ఆదివారం రాత్రి కుప్పం-పలమనేరు జాతీయ రహదారి పై తమ సిబ్బందితో వాహనాలను తనిఖీ చేయగా గ్రానైట్ లారీ కంటపడిందన్నారు. లారీ డ్రైవర్‌ను ఆపి ప్రశ్నించగా అతడి వద్ద గ్రానైట్‌కు సంబంధించిన పత్రాలు ఏమి లేదన్నారు. లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి పలమనేరు మైన్స్ సమాచారం అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

భగవంతుడి సేవే పరమావధిగా తిరుమలనంబి

రంగనాథ యతీంద్ర మహాదేశికన్



తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భగవంతుడి సేవే పరమావధిగా భావించి తిరుమలనంబి జీవితం మొత్తాన్ని శ్రీవారి కైంకర్యానికి అంకితం చేశారని అహోబిలం మఠాధిపతి శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అన్నారు. ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం సోమవారం తిరుమలలోని దక్షిణ మాడ వీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ఘనంగా జరిగింది. ఈకార్యక్రమానికి వచ్చిన రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి అనుగ్రహభాషణం చేస్తూ తిరుమలనంబి తన తాతగారైన యమునాచార్యుల ఆజ్ఞతో తిరుమలకు వచ్చి పాపవినాశనం నుంచి తీర్థం తీసుకువచ్చి శ్రీవారికి అభిషేకం చేసేవారన్నారు. వృద్ధాప్యంలో కూడా పాపవినాశనం నుంచి స్వామి జాలిపడి అంజనాద్రిలో ఉద్భవింపజేసిన ఆకాశగంగ తీర్థంతో అభిషేకం చేయాల్సిందిగా ఆజ్ఞాపించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. సాక్షాత్తు భగవంతుడు ఉపదేశించిన భగవద్గీతలోని 700 శ్లోకాలను సంగ్రహించి యమునాచార్యులు 32 శ్లోకాలతో గీతార్థ సంగ్రహం పేరుతో గ్రంథం రచించారన్నారు. ఈశ్లోకాలు బ్రహ్మవిద్యతో సమానమైనవని చెప్పారు.

తిరుమల మొదటి పౌరుడు తిరుమలనంబి

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. శ్రీవారికి తీర్థ కైంకర్యం చేసిన తిరుమల ప్రథమ పౌరుడు తిరుమలనంబి అన్నారు. శ్రీవారి వైభవాన్ని నలుదిశలా చాటడానికి కృషి చేసిన పరమ భక్తుల జన్మదినాల సందర్భంగా ప్రతి ఏడాది వారిపేరుపై ఉన్న ఉప ఆలయాల్లో వార్షికోత్సవాలు టీటీడీ నిర్వహించడం ఆనవాయితీ అన్నారు. తర్వాత ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన 16 మంది ప్రముఖ పండితులు శరణాగతి తత్వాన్ని గురించి వివరించారు. ఈకార్యక్రమంలో టీటీడీ ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రాం అధికారి రాజగోపాల్, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ ప్రోగ్రాం అధికారి పురుషోత్తం, తిరుమలనంబి వంశీకులు తాతాచార్య కృష్ణమూర్తి, రంగనాథన్, అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ముగ్గురు స్మగ్లర్ల అరెస్టు

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, సెప్టెంబరు 9: తిరుమల పాపవినాశనం సమీపంలోని అటవీ ప్రాంతంలో సోమవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి, 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్ కుమార్ బృందం సోమవారం తిరుమల పాప వినాశనం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా, నిషేధిత అటవీ ప్రాంతంలో స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంట పడ్డారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలను పడవేసి పారిపోయారు. టాస్క్‌ఫోర్సు బృందం వారిని వెంబడించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఆ ప్రాంతంలో వారు వదిలి వెళ్లిన పది ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లర్లు తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునామత్తూరుకు చెందిన వారుగా గుర్తించారు. వారిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

ఎర్రావారిపాలెం ఎస్ఐకి చార్జి మెమో

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9: అవినీతికి పాల్పడిన ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీ సుబ్బరాయుడు సస్పెండ్ చేశారు.శ్రీగంధం కేసులో నిందితుల కుటుంబీకులను బెదిరించి డబ్బులు వసూలు చేయడమే ఇందుకు కారణం.గత నెల 20తేదీన ఎర్రావారిపాలెంలోని ఆటోలో శ్రీగంధం తరలిస్తుండగా జడ్పీ హైస్కూల్ వద్ద 8మందిని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు.వీరిలో ఇర్లపాలేనికి చెందిన గుండ్రాతి కుప్పం చంద్రయ్య ఒకరు.ఆయన కుమారుడు సుబ్రమణ్యం బతుకు తెరువు కోసం కువైట్ వెళ్లి ఇటీవలే వచ్చాడు. కువైట్ వెళ్లేందుకు చేసిన అప్పులు తీర్చి మళ్లీ వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో అతడి తండ్రి చంద్రయ్య శ్రీగంధం కేసులో పట్టుబడ్డాడు.ఇదే అదునుగా భావించిన కానిస్టేబుళ్లు దేవేంద్ర నాయక్, సి. గురప్ప నిందితుడు చంద్రయ్య భార్య లక్ష్మిని, కుమారుడు సుబ్రమణ్యాన్ని డబ్బులిమ్మని బెదిరించారు. లేదంటే సుబ్రమణ్యాన్ని శ్రీగంధం కేసులో ఇరికించి కువైట్ పోనీయకుండా చూస్తామని బెదిరించారు.దీంతో ఇల్లు కట్టుకునేందుకు కష్టపడి దాచుకున్న రూ.29వేలను వారికి సమర్పించుకున్నారు.ఓ ఆటో డ్రైవర్‌ను కూడా శ్రీగంధం తరలింపు కేసు పెట్టిస్తామని బెదిరించి రూ.10 వేలు వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది.ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో శనివారం 'స్మగ్లింగ్ కేసు పెడతామని డబ్బుల వసూలు....ఎర్రావారిపాలెం స్టేషన్‌లో వసూల్‌నాయక్‌లు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎస్పీ సుబ్బరాయుడు స్పెషల్ బ్రాంచ్ అధికారులనుంచి వివరాలు తెప్పించుకున్నారు.డబ్బు వసూలు చేసిన కానిస్టేబుళ్ళు దేవేంద్రనాయక్,గురప్పలను సస్పెండ్ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దారి తప్పుతున్న కానిస్టేబుళ్ళపై నిర్లక్ష్య వైఖరి అవలంబించిన ఎస్ఐ ఎర్రిస్వామికి చార్జిమెమో ఇచ్చారు.

సీపీఆర్‌పై పోలీసులకు శిక్షణ



పోలీసులతో సీపీఆర్ చేయిస్తున్న వైద్యులు

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఎవరైనా కుప్పకూలిపోతే సీపీఆర్(హృదయ శ్వాసకోశ పునరుజ్జీవనం) చేయడంపై పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. గత శనివారం కడపకు చెందిన ఓ యువతి గుండెపోటుతో తిరుమల క్యూలైన్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులకు, విజిలెన్స్ అధికారులకు, సిబ్బందికి, శ్రీవారిసేవకులకు సోమవారం సాయంత్రం తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌లో ప్రముఖ వైద్యుల ఆధ్వర్యంలో సీపీఆర్ చేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శ్రీవారి దర్శనార్థం వచ్చేవారిలో కొంతమంది గుండెపోటుతో కుప్పకూలిపోతుంటారన్నారు.వారికి సీపీఆర్ చేయడం ద్వారా కొంతమందిని రక్షించే అవకాశమున్న నేపథ్యంలో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.తిరుమల, తిరుపతిల్లో విధులు నిర్వహించే ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్నామన్నారు.అక్టోబరు 4 నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు మాడవీధుల్లో ఎస్పీ తనిఖీలు నిర్వహించారు. భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఏఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ విజయ్‌శేఖర్, సీఐలు విజయ్‌కుమార్, మురళీమోహన్‌రావు, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని లిక్కర్ వ్యాన్ బోల్తా

రోడ్డు పాలైన మద్యం, వ్యాను డ్రైవర్‌కు స్వల్పగాయాలు



బోల్తా పడిన వ్యాను, పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9: ఆర్టీసీ బస్సు ఢీకొని మద్యం తరలిస్తున్న వ్యాన్ బోల్తా పడిన ఘటన రేణిగుంట-తిరుపతి మార్గంలోని కాటన్‌మిల్లు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. అలిపిరి సీఐ రాంకిషోర్ తెలిపిన వివరాల మేరకు.. రేణిగుంట మద్యం గోడౌన్ నుంచి ఓ వ్యానులో తిరుపతిలోని అమెరికన్ బార్‌కు మద్యం తరలిస్తున్నారు. ఈ వ్యాను కాటన్ మిల్లు వద్ద యూ టర్న్ తీసుకొంటుండగా తిరుపతికి వస్తున్న శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. వ్యాన్ బోల్తా పడటంతో బాటిళ్ల పగిలిపోయి మద్యమంతా రోడ్డు పాలైంది. వ్యాను డ్రైవర్ సరళబాలాజీకి స్వల్ప గాయాలయ్యాయి. దాదాపు 80 శాతం మద్యం బాటిళ్ల ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యానును అలిపిరి స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి ఇద్దరు డ్రైవర్ల వాహన రికార్డులు స్వాధీనం చేసుకున్నారు. బస్సు డ్రైవర్ మనోజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. రూ.25లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు.

రోడ్ల నిర్మాణంపై ఆర్అండ్‌బీ, ఐఐటీల మధ్య ఎంవోయూ



ఏర్పేడు, సెప్టెంబరు 9: రోడ్ల నిర్మాణంలో అధునాతన పద్ధతులపై ఆర్అండ్‌బీ, ఐఐటీ ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీని సోమవారం రోడ్డు భవనాల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ నయీముల్లా సందర్శించారు. కొత్త సాంకేతిక పద్ధతులు, తక్కువ మెటీరియల్ ఉపయోగించి రోడ్లకు ఏర్పడిన గుంతలను పూర్తిస్థాయిలో పూడ్చడం, అవి ఎక్కువ కాలం మన్నిక వచ్చేందుకు తీసుకోవలసిన చర్యలపై అధ్యయనం చేయాలని కోరారు. ఈ మేరకు ఐఐటీ అధికారులలో ఎంవోయూ కుదర్చు కున్నారు. అమెరికా వంటి దేశాలల్లో తక్కువ ఖర్చుతో ఎక్కువ కాలం మన్నిక వచ్చే విధంగా రోడ్లను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తించాలని నయీముల్లా ఐఐటీ అధికారులకు సూచించారు. అనంతరం ఐఐటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రోడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, ఆర్అండ్‌బీ ఈఈ మధుసూదనరావు, డీఈ నాగ మల్లయ్య, ఏఈ ప్రమీల, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురగయ్య నాయుడు పాల్గొన్నారు.

ఐసర్‌కు ఆర్టీసీ బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 9: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్)కు ఆర్టీసీ బస్సుల రవాణాను సోమవారం ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. విద్యార్థుల సౌకర్యార్థం బస్సులు నడపాలని ఐసర్ ప్రొఫెసర్ కె.విజయమోహన్‌పిళ్ళై జిల్లా ఆర్టీసీ యంత్రాంగాన్ని కోరారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టి మంగళం డిపోకు చెందిన ఆర్డినరీ బస్సును ఎంపిక చేశారు. ఉదయం ఎనిమిది గంటలకు సెంట్రల్ బస్సుస్టేషన్‌లోని శ్రీహరి బస్టాండులో ప్లాట్‌ఫామ్ నెంబరు 20.. వెంకటగిరి పాయింట్ నుంచి ఈ బస్సు బయల్దేరుతుంది. రేణిగుంట, ఏర్పేడు మీదుగా 9.10గంటలకు ఐసర్‌కు చేరుకుంటుంది. సాయంత్రం 4.55గంటలకు తిరుపతిలో బయల్దేరి ఆరు గంటలకు ఐసర్‌కు చేరుకుంటుంది. దీంతోపాటు వెంకటగిరి డిపోకు చెందిన ఆర్డినరీ 6, ఎక్స్‌ప్రెస్ 6బస్సులు కూడా ఐసర్ వద్ద ఆపేలా డీపీటీవో ఉత్తర్వులు జారీచేశారు. ఈ బస్సులు వెంకటగిరి, తిరుపతి మధ్య ఉదయం 5నుంచి రాత్రి 9గంటల వరకు ప్రతి అరగంటకో బస్సు నడుస్తుంది.

రేపు అల్లైడ్ హెల్త్ సైన్స్ పారామెడికల్ డిప్లొమా మిగులు సీట్లకు కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9: ఎస్వీ వైద్య కళాశాలలో అల్లైడ్ హెల్త్‌సైన్స్ పారామెడికల్ డిప్లొమా కోర్సుల్లో మిగిలిన సీట్లకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ 9 సీట్లు, డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్ 3 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులు 11న ఉదయం 9.30 నిమిషాలకు ప్రిన్సిపాల్ కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు వెంటనే రూ.7,700 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94408 79943 నెంబరును లేదా కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

ఇసుక లారీ బోల్తా



చంద్రగిరి, సెప్టెంబరు 9: చంద్రగిరి మండలం, దానామూర్తిపల్లె వద్ద పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలో సోమవారం ఉదయం ఇసుక లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, ఇద్దరు డ్రైవర్లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి నుంచి చిత్తూరు వైపు ఇసుక లోడుతో వెళుతున్న లారీ మార్గమధ్యంలో దానామూర్తిపల్లె వద్దకు రాగానే టైరు పంక్చర్ అయి అదుపు తప్పి రోడ్డు పక్కనున్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈప్రమాదంలో లారీ నుజ్జు నుజ్జు కాగా, అందులో ఉన్న డ్రైవర్లు ముత్యాలు, కుప్పయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్లు బీఎన్ కండ్రిగ సమీపంలోని కత్తివారికండ్రిగ గ్రామానికి చెందిన వారుగా తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందూస్థాన్ స్కౌట్స్ గైడ్స్‌కు గుర్తింపు ఉంది : డీఈవో

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9: హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు కేంద్ర మానవ వనరుల క్రీడా మంత్రిత్వశాఖ గుర్తింపు ఉన్నట్టు తిరుపతి డీఈవో డాక్టర్ వి.శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో కొన్ని పాఠశాలల్లో నకిలీ స్కౌట్స్ గైడ్స్ కార్యకలాపాలపై పరిశీలించిన నేపథ్యంలో హిందూస్థాన్ స్కౌట్స్ గైడ్స్ సమర్పించిన దాఖలాల ప్రకారం గుర్తింపు ఉన్నట్టు తాము గుర్తించామని పేర్కొన్నారు. అయితే పాఠశాల విద్య సంచాలకుల ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుతం భారత్ స్కౌట్స్ గైడ్స్‌కు మాత్రమే కార్యక్రమాలు నిర్వహించేందుకు అనుమతి ఉందన్నారు.

బై..బై..గణేశా

● యువత కేరింతలు, బాజాభజంత్రీల నడుమ వైభవంగా వినాయక విగ్రహాల నిమజ్జనం ● మండపాల వద్ద భక్తులకు అన్నదానాలు



నిమ్మనపల్లిలో గణేశ్ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



గుర్రంకొండలో నిమజ్జనానికి ఊరేగుతున్న వినాయక ప్రతిమలు



కలకడ బాటవారిపల్లెలో వినాయకుడి ఊరేగింపు

పీలేరు, సెప్టెంబరు 9: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆఖరి ఘట్టమైన నిమజ్జనం సోమవారం పీలేరులో అంగరంగ వైభవంగా జరిగింది. సర్వమత సమ్మేళనంగా, వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాలు సమష్టిగా కృషి చేసి వినాయక విగ్రహాల నిమజ్జనం చేశారు. యువకుల కేరింతలు, నృత్యాలు, హోరెత్తించే డీజేలు, ఉర్రూతలూగించే బళ్లారి డ్రమ్ములు, కేరళ సాంప్రదాయ నృత్యాలు, బాణాసంచా పేలుళ్లు, కళ్లు మిరుమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలు, ఒక దానిని మించిన ఆకారంతో మరొక భారీ వినాయక విగ్రహాలు...వాటన్నింటిని మధ్య "జై బోలో గణేశ్ మహరాజ్ కీ..జై" అంటూ నినాదాలతో పీలేరులో గణేశ్ విగ్రహాల నిమజ్జన కార్యక్రమం అత్యంత శోభాయమానంగా జరిగింది. సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నిమజ్జన కార్యక్రమం అర్ధరాత్రి వరకు సాగింది. కేరళ నుంచి వచ్చిన సాంప్రదాయ డ్రమ్స్, బళ్లారి డ్రమ్స్, రాజమండ్రి నుంచి వచ్చిన కళాకారులు, స్థానిక చెక్కభజన కళాకారులు నిమజ్జన ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పీలేరు పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్ద విగ్రహాలకు ఆర్ఎస్ఎస్ నాయకులు, పట్టణ ప్రముఖులు హారతి సమర్పించారు. నిమజ్జన ర్యాలీని వీక్షించేందుకు పెద్దఎత్తున మహిళలు, చిన్నారులు, ప్రజలు పట్టణ ప్రధాన రహదారి అయిన ఎల్‌బీఎస్ రోడ్డులో బారులు తీరారు. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయచోటి ఇన్‌చార్జ్ డీఎస్పీ సుధాకర్, పీలేరు ఇన్‌చార్జ్ అర్బన్ సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ బాలకృష్ణ పటిష్టమైన చర్యలు చేపట్టారు. వాల్మీకిపురం, కలకడ, కలికిరి సర్కిళ్ల నుంచి అదనపు బలగాల రప్పించి బందోబస్తు నిర్వహించారు. పీలేరు పట్టణంతోపాటు మండల వ్యాప్తంగా ప్రతిష్ఠించిన 186 విగ్రహాలను సోమవారం నిమజ్జనం చేశారు. స్థానిక ఆర్యవైశ్య, వడ్రంగి, ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్‌లు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించాయి.

మదనపల్లె అర్బన్‌లో: వినాయక చవితి వేడుకల సందర్భంగా మండపాలలో ప్రతిష్ఠించిన గణనాథులను మూడో రోజైన సోమవారం యువత కేరింతలు, బాజాభజంత్రీలు, బాణసంచా పేలుళ్ల నడుమ వైభవంగా నిమజ్జనం చేశారు. పట్టణంలోని రోజాప్లాట్స్, కుమార్ ఫ్యాషన్ వద్ద వినాయకుడికి బీజేపీ రాజంపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల కృష్ణమూర్తి, సురేష్, ప్రవీణ్, శంకర తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రెడ్డీస్ కాలనీలో జితేంద్రరెడ్డి, సాయికిరణ్, కౌస్టిక్ నాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడికి, సుభాస్ రోడ్డులో తెలుగు యువత నేత అరుణ్‌తేజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిని వినాయకుడికి ప్రత్యేకంగా పూజలు చేశారు. అనంతరం బళ్ళారి డ్రమ్స్‌తో ఊరేగింపుగా తరలివెళ్లి బైపాస్‌లోని స్వామి చెరువులో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దమండ్యం రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డుకు పెద్దమండ్యం సోమేష్‌కుమార్ రూ.38 వేలు అత్యధికంగా వేలంపాట పాడి దక్కించుకున్నారు. అలాగే కలిచెర్ల, సిద్దవరం, శివపురం, పాపేపల్లి, సి.గొల్లపల్లి, చెరువకిందపల్లి తదితర గ్రామాలలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. అన్ని గ్రామాలలో కోలాహలంగా వినాయకుడి ఊరేగింపు కార్యక్రమాలు జరిగాయి.

ములకలచెరువులో: మండలంలో సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ములకలచెరువులో వాడవాడలా, గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి ప్రతిమలను బళ్ళారి డప్పులు, బాణాసంచా పేలుళ్ళ మధ్య ఊరేగింపుగా తీసుకెళ్ళి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో ఉల్లాసంగా ఉత్సాహంగా నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నారు.

గుర్రంకొండలో: వినాయక చవితి పండుగ పురస్కరించుకొని ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను సోమవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా గుర్రంకొండ పట్టణంలోని బలిజగడ్డ, ఇందిరమ్మకాలనీ, అరిగెలవారిపల్లె, నరిమడుగు, తరిగొండ, బజారువీధిలో ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలను చెక్కభజనలు, కోలాటాలు, భళ్లారి డ్రమ్స్, బాణసంచులు పేల్చుతూ ఘనంగా ఊరేగింపుగా తరలించి గంగరాజుకుంట చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కలకడలో: మండలంలోని కలకడ, బాటవారిపల్లెతోపాటు పలు గ్రామాల్లో సోమవారం వినాయక నిమజ్జనాన్ని కోలాహలంగా జరుపుకున్నారు. వివిధ ఆకారాలతో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను రకరకాల పూలతో అలంకరించారు. మంగళవాయిద్యాలు, కొలాటాలు, బాణసంచా పేల్చుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి ఝరికోనలో నిమజ్జనం చేశారు. ఆయా గ్రామాల్లో భక్తులు గణపతికి కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిర్వాహకులు అన్నదానాలు చేశారు. కలకడ తేరువీధిలో గణపతి మండపం వద్ద నిర్వహించిన వేలంలో స్వామి వారికి నైవేద్యంగా ఉంచిన 10 కిలోల లడ్డు రూ.86,116 పలికింది. గ్రామస్తులు పలువురు వేలం పాటలో పాల్గొన్నగా రామకిశోర్, సరళమ్మ దంపతులు అధిక మొత్తాన్ని వెచ్చించి లడ్డును దక్కించుకున్నారు.

కలికిరిలో: వినాయక విగ్రహాల నిమజ్జనం సోమవారం కలికిరిలో కోలాహలంగా నిర్వహించారు. వినాయక చవితి మూడవ రోజే విగ్రహాల నిమజ్జనాన్ని నిర్వాహకులు పూర్తి చేశారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ నిమజ్జనం కోసం గణపతి విగ్రహాలను పట్టణంలో వైభవంగా ఊరేగించారు. మండలంలో మొత్తం 34 గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు. కలికిరి పంచాయతీకి సం బంధించినంత వరకూ పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. కలికిరి పోలీసులు బందోబస్తు ఏర్పాట్లలో పాల్గొన్నారు. కాగా మండలం మొత్తం మీద టీబీ రోడ్డులో నెలకొల్పిన గణపతి విగ్రహానికి సంబంధిం చిన 5 కిలోల లడ్డూకు అత్యధిక వేలం పాట దక్కింది. అదే వీధికి చెందిన ఆశాలత రూ.1.30లక్షలకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

తంబళ్లపల్లెలో : తంబళ్లపల్లెలో వినాయక నిమజ్జన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు మండపాల్లో పూజలందుకున్న గణనాథులను ట్రాక్టర్లపై ఊరేగించి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా పేలుళ్ల నడుమ బావులు, చెరువుల వద్దకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కాగా తంబళ్లపల్లె పాత కాలేజీ మైదానంలో గణేశ్ యూత్ సభ్యులు వినాయక చవితి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన డీ నాని చేసిన మిమిక్రీ షో భక్తులను అలరించింది. సోమవారం మండపం వద్ద రిటైర్డ్ టీచర్ అరుణకుమారి అన్నదానం ఏర్పాటు చేశారు.

పెద్దతిప్పసముద్రంలో: పెద్దతిప్పసముద్రం మండలంలోని వివిధ గ్రామాల్లో గణనాథుని నిమజ్జన వేడుకలు కోలాహలంగా జరిగాయి. గత రెండు రోజులుగా ప్రత్యేక పూజలందుకున్న గణనాథుడు సోమవారం తల్లి గంగమ్మ చెంతకు చేరాడు. పెద్దతిప్పసముద్రం మండల కేంద్రమైన పెద్దకాలువగడ్డ, రామాపురం వీధి, దళితవాడ, పొగచూరి వీధి, గంగులరెడ్డివీధి, లలో ఏర్పాటు చేసిన బొజ్జ గణపయ్యలను గ్రామస్థులు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. ఉదయం ప్రత్యేకపూజలు నిర్వహించి లడ్డు వేలం పాటలు నిర్వహించారు. సాయంత్రం బళ్లారి డ్రమ్ములు, కోలాటలు, బాణాసంచా పేలుళ్ల నడుమ యువకులు, ఉత్సాహంగా కేరింతలు కొడుతూ పట్టణ పురవీధుల్లో బొజ్జ గణపయ్యను ఊరేగించి నిమజ్జనం చేశారు. కాగా రామాపురంవీధికి చెందిన గణపయ్య ఎదుట కోలాట నృత్య ప్రదర్శనలు అలరించాయి. రామాపురం వీధికి చెందిన గణేశ్ యువసేన సంఘ సభ్యులు భారీ ఎత్తున పట్టణంలో అన్నదానం నిర్వహించారు.

నిమ్మనపల్లిలో: మండలంలో వెలసిన వినాయక విగ్రహాలను భక్తిశ్రద్ధలతో సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డులను పలువురు అధిక ధర వెచ్చించి దక్కించుకొన్నారు. కాగా వెంకోజిగారిపల్లిలో వెలసిన వినాయక స్వామివారి లడ్డూను రూ.9వేలకు గంటా వెంకటకరమణ దక్కించుకొన్నారు. అనంతరం నిమ్మనపల్లి మాజీ సర్పంచ్ శ్రీరాములు, టీడీపీ నాయకులు విజయ్ చినబాబులు ఏర్పాటు చేసిన విగ్రహం వద్ద బళ్లారి డ్రమ్స్ ఊరేగింపు చేపట్టారు. అలాగే మండలంలోని అన్ని పంచాయతీల్లో వెలసిన గణేశ్ విగ్రహాలను దాదాపు 80శాతం వరకు నిమజ్జనానికి తరలించారు. నిమజ్జన ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రామసముద్రంలో: మండల కేంద్రం పరిధిలోని తిరుమలరెడ్డిపల్లె, బైరాజుపల్లె, గుంతలపేట, కేసీపల్లె, మట్లవారిపల్లె, మినికి, నరసాపురం, ఊలపాడు, దిన్నిపల్లె, మానేవారిపల్లె, పెద్దకురప్పల్లెలలో సోమవారం వినాయక నిమజ్జనం వైభవంగా నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని పూలతో అలంకరించి పురవీధులలో ఊరేగింపు చేశారు. మండల కేంద్రంలోని బజారు వీధిలో ఆర్యవైశ్య యువత ఆధ్వర్యంలో వినాయకుడిని కేరళ వాయిద్యాల నడుమ ఊరేగింపు చేశా రు. నిమజ్జనంసందర్భంగా ఎస్ఐ చంద్రశేఖర్ పోలీస్ సిబ్బందితో పర్యవేక్షణ చేశారు. తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ కె.భరత్, కె.వెంకట్, గణేష్ కుటుంబీకులు భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట మండలంలో సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనం వైభవంగా జరిగింది. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోని బీసీకాలనీ, కరెంట్‌కాలనీ, జయశ్రీకాలనీ, పాశంవీధి, పోకనాటివీధి, సింహంవీధి, బైపాస్‌రోడ్డు, శెట్టిపల్లిరోడ్డు, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను బళ్లారిడ్రమ్ములు, చెక్కభజనలు, యువకుల నృత్యాలతో పురవీధులలో ఊరేగించి గుమ్మసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమాలలో నిర్వాహక కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. పట్టణసీఐ రాజారెడ్డి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.



పీలేరులో గణపయ్యను నిమజ్జనానికి తీసుకెళుతున్న ప్రజలు



కలికిరిలో అలంకరించిన గణపతి విగ్రహాల ఊరేగింపులో ప్రజలు



ములకలచెరువులో వినాయకుడి గ్రామోత్సవం

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 9: మదనపల్లె నియోజకవర్గంలో ప్రజల మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని కృష్ణానగర్, ఇందిరానగర్‌లో ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో తాగునీటి సమస్య ఉందని, కాలువలు శుభ్రం చేయించాలని, వీధి దీపాలు వేయించాలని ప్రజలు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులతో మాట్లాడుతూ సాధ్యమైనంత తొందరగా ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

సర్వేయర్ పనితీరుపై విచారణ చేయించండి

● కలెక్టర్‌కు మాలమహానాడు నేతల ఫిర్యాదు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 9: మదనపల్లె మండల సర్వేయర్ పనితీరుపై విచారణ చేయించాలని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం రాయచోటిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు కలెక్టర్ అర్జీ అందజేశారు. డివిజన్ కేంద్రమైన మదనపల్లె మండలంలో 20 గ్రామ సచివాలయాల్లో సర్వే కోసం చలాను కట్టడానికి వెళితే, అక్కడి సిబ్బంది మండల సర్వేయన్‌ను కలవాలని చెబుతున్నారని మండల సర్వేయర్ రెకమెండేషన్ చేస్తేనే గ్రామ సర్వేయర్లు సర్వేకు వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారుల భూములను వెంటనే సర్వే చేయించే సర్వేయర్ పేదలు, రైతుల భూముల సర్వేకి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు. చలానాలు కట్టి తిరస్కరించబడిన రైతులను విచారిస్తే అసలు విషయం తెలుస్తుందని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ మదనపల్లె తహసీల్దార్ ఖాజాబీకి వీడియో కాన్ఫరెన్స్‌లో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మాలమహానాడు నాయకులు మల్లెల మోహన్, రమణ, పాల్గొన్నారు.



రాయచోటిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న మాలమహానాడు నాయకులు

● మదనపల్లె మండలం వలసపల్లె హౌసింగ్ కాలనీలో అనర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించారని గ్రామస్థులు మదుకర్‌రెడ్డి, శివరామ్, నారాయణ, జాఫర్, వెంకటేశు, సాలమ్మ, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వలసపల్లె హౌసింగ్ కాలనీలోని 311, 312 ప్లాట్లను ప్రభుత్వ ఉద్యోగుల భార్యలకు కేటాయించారని దీనిపై గ్రామ వీఆర్వో, హౌసింగ్ ఈఈకి ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. వాటితో పాటు 10 ఇళ్ల స్థలాలను అనర్హులకు కేటాయించారని, విజిలెన్స్ అధికారులతో విచారించాలని ఆఫిర్యాదులో కలెక్టర్‌ను కోరారు.

భూ సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 9: మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో భూ సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని 11 మండలాల నుంచి 53 మంది సబ్‌కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతి అర్జీని చదవడంతో పాటు, అర్జీదారుని సమస్యను సావధానంగా విన్న సబ్‌కలెక్టర్ సంబంధిత మండలాల అధికారులతో మాట్లాడి సమస్యలపై విచారించాలన్నారు. అర్జీలను, ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ సూచించారు. ఎక్కువగా టెన్ వన్ అడంగల్, డిజిటల్ కీ సమస్యలు, భూ భాగ పరిష్కార సమస్యలు, హౌసింగ్ పథకాలు, పింఛన్ల కోసం అర్జీలు వచ్చాయి. విశాఖపట్నం స్టీలు ప్లాంటును ప్రైవేటు పరం చేయవద్దని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు సీవీ రమణ, నారాయణ సబ్‌కలెక్టర్‌కు అర్జీ అందజేశారు.



ప్రజల నుంచి అర్జీలను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

రేపు పీలేరులో మినీ జాబ్ మేళా

పీలేరు, సెప్టెంబరు 9: పీలేరులోని సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 11వ తేదీన మినీ జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. 18 ఏళ్ల నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న 10వ తరగతి నుంచి ఏదైనా పీజీ, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసిన నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని ఆయన తెలిపారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి నెలకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. నెలింక్ టెలీ కమ్యూనికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, డిక్షన్ టెక్నాలజీస్, జీనియస్ కాన్‌స్టంట్ ల్యాబ్, వింగ్ టెక్, మీరో, డైకిన్, యంగ్ ఇండియా వంటి సంస్థలు జాబ్ మేళాలో పాల్గొంటాయని, ఈ అవకాశాన్ని అన్నమయ్య జిల్లాలోని నిరుద్యోగుల సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ జాబ్ మేళా 11వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9966086996, 8997776368 నెంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

తంబళ్లపల్లె సెప్టెంబర్ 9 : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ఈనెల 11వ తేదీ (బుధవారం) తంబళ్లపల్లెలోని ప్రభుత్వ ఐటీఐలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం, సీడాఫ్ వారి సంయుక్త అధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ ఉత్తీర్ణులైన వారికి వారివారి విద్యార్హతను బట్టి జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు వారి బయోడెటాతో పాటు ఆధార్ కార్డు, రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, విద్యార్హత ధ్రువపత్రాల జిరాక్స్ కాపీలతో ఈనెల 11వ తేదీన తంబళ్లపల్లె ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చేనేత, జౌళి పరిశ్రమ కౌన్సిల్ సభ్యుల నియామకం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9: చేనేత, జౌళి పరిశ్రమ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుల ను సోమవారం నియమించారు. ఇందులో ప్రధాన కార్యదర్శిగా పూజల అర్జున్, ఉపాధ్యక్షులుగా అనంత రామచంద్ర(సొసైటీ రామచంద్ర), మంత్రిబాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రాష్ట్రాల చేనేత పరిశ్రమకు ఉన్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార దిశగా పని చేస్తామన్నారు. రెండు రాష్ట్రాలోని సీఎంలు, చేనేత శాఖ మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, ఆప్కో, టెస్కో ఎండీలు, ఛైర్మన్లు, జౌళి శాఖ కమిషనర్లు, జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులు చేనేత రంగాన్ని ముందుకు నడిపించడానికి సహకరించాలని వారు కోరారు.

సిరికల్చర్ రీలర్లకు న్యాయం చేయాల్సిందే..

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 9: మదనపల్లె పట్టణం సిరికల్చర్ కాలనీలో అర్హులైన రీలర్లకు స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని రీలర్లు, బహుజన యువసేన నాయ కులు కోరారు. ఆమేరకు మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ధర్నాలో బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్, రీలర్లు మాట్లాడుతూ నిజమైన అర్హులకు కేటాయించాల్సిన రీలింగ్ యూనిట్లను అనర్హులైన వైసీపీ నాయకుల అనుచరులకు కేటాయించారని ఆరోపిం చారు. దీనిపై సబ్‌కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. సిరికల్చర్ అధికారులను పిలిచి వివరాలు అడిగారు. రీలర్ల ఫిర్యాదుపై సమగ్రంగా విచారించి అర్హులకు న్యాయం చేయాలని ఆదేశించారు.



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రీలర్లు, బహుజన యువసేన నాయకులు

గర్భిణులు వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కలకడ, సెప్టెంబరు 9:మంచి ఆరోగ్యం శిశువు ఎదుగుదలకు గర్భిణులు వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని వైద్యాధికారి డాక్టర్ జవహర్‌బాబు సూచించారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి 40 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 13 మందిని మెరుగైన వైద్యం కోసం ఉన్నతస్థాయి ఆసుపత్రికి సిఫార్స్ చేశారు. అలాగే గర్భవతులకు ప్రభుత్వం కల్పించే వసతులను వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

చికిత్స పొందుతూ మహిళ మృతి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9: ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్ఐ రమణ తెలిపారు. మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన భారతి (33) ఈ నెల 7వ తేదీన వాస్మోల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన విషయం తెలిసిం దే. చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, నక్కల బండకు చెందిన వెంకటరమణ, సుబ్బరత్నమ్మ దంపతుల కుమార్తె భారతిని 19 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన శివాకు ఇచ్చి వివాహం చేశారు. వారు మదనపల్లె మండలం, బసినికొండలో నివాసం ఉంటున్నారు. వినాయక చవితి పండుగకు ఊరు వెళ్లాలని కోరడంతో దానికి భర్త నిరాకరించడం మనస్థాపానికి గురై వాస్మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. దీంతో ఆమెను స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కాగా మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంచనామా కోసం తీసుకొచ్చారు. మృతిరాలి తల్లి సుబ్బరత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ చెప్పారు.

నేడు ఉచిత మోకాలి చికిత్సా శిబిరం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు9: మదనపల్లె పట్టణంలో ఈనెల 10 నుంచి మూడు రోజులపాటు ఉచిత మోకాలి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఛైర్మన్ లయన్స్ భాస్కర్‌నాయుడు తెలిపారు. లయన్స్ ఇంటర్నేషనల్, లయన్స్ క్లబ్ ఆఫ్ మదనపలె, లయన్స్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ నెల 10 నుంచి 13 వరకు లయన్స్ క్లబ్ మదనపల్లె, లయన్స్ ఐ హాస్పిటల్, రవీంద్రనగర్‌లో నిర్వహిస్తునట్లు తెలిపారు.ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేషనల్ యోగా మీట్‌కు సర్వం సిద్ధం

● 12 నుంచి 14 వరకు వలసపల్లె జవహర్ నవోదయలో నిర్వహణ

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9: మండలంలోని వలసపల్లె పంచాయతీలోని జవహర్ నవోదయ సమితిలో ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు నేషనల్ యోగా మీట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ బెంగళూరు రూరల్ నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి, వలసపల్లె జవహర్ నవోదయ సమితి ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. సోమవారం వారు స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. నేషనల్ యోగా మీట్‌కు దేశం నలుమూలల్లోని 8 రీజియన్స్ నుంచి 350 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. నేషనల్ యోగా మీట్‌ను జిల్లాలోని వలసపల్లెలో మొదటసారిగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ నుంచి ప్రత్యేకంగా యోగా మాస్టర్లు విచ్చేయనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా మధ్యప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌గడ్ రాష్ట్రాలు భోపాల్ రీజియన్‌కు, జమ్ము కశ్మీర్, పంజాబ్, చండీఘర్, హిమాచల్‌ప్రదేశ్, లడఖ్ రాష్ట్రాలు చండీగడ్ రీజియన్‌కు, ఏపీ, కర్ణాటక, తెలంగాణా, కేరళ, అండమాన్ అండ్ నికోబర్, పాండిచ్చేరి, లక్షద్వీప్ రాష్ట్రాలు హైదరాబాదు రీజియన్‌కు, డయ్యు అండ్ డామన్, దాద్రనగర్ హవేలి, మహారాష్ట్ర, గుజరాత్, గోవా, పూణే రీజియన్‌కు, బిహార్, పశ్చిమబెంగాల్, జార్ఖండ్, పాట్నా రీజియన్‌కు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, లక్నో రీజియన్‌కు, హర్యానా, రాజస్థాన్, డిల్లీ జైపూర్ రీజియన్‌కు, మేఘాలయ, అస్సాం, మణిపూర్, సిక్కిం, అరుణాచలప్రదేశ్, నాగాలాండ్, మిజోరం, త్రిపుర రాష్ట్రాలు షిల్లాంగ్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఆయా రీజియన్స్ నుంచి విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. ఈ మీట్ విజేతలు నవోదయ రాష్ట్రంగా ఏర్పడి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సత్యసాయి జిల్లా జవహర్ నవోదయ ప్రిన్సిపాల్ ఎం.నాగరాజ్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బెంగళూరు జవహర్ నవోదయ సమితి ప్రిన్సిపాల్ చక్రవర్తి

అంధకారంలో జాతీయ రహదారి

ములకలచెరువు, సెప్టెంబరు 9: ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో వీధి దీపాలు వెలగక అంధకారం నెల కొంది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఈ మార్గంలో ఉన్న వీధి దీపాలు తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేసినా ఇంత వరకు వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపో వడంతో ఈ దుస్థితి నెలకొంది. శ్రీ సత్యసాయి - అన్నమయ్య జిల్లా సరిహద్దులోని ములకలచెరువు నుంచి మద నపల్లె వరకు ఉన్న 43 కిలో మీటర్ల జాతీయ రహదారి(ఎన్ హెచ్ - 42) విస్త రణ పనులకు కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబరులో రూ.480.10 కోట్లు విడుదల చేయగా 2022లో పనులు ప్రారంభించారు. అప్పట్లో పనులకు అడ్డుగా ఉన్నాయని రోడ్డుకిరువైపులా ఉన్న పాత విద్యుత్ స్థంభాలు తొలగించి జాతీయ రహదారిలోని షాదీమహల్ నుంచి రైల్వే గేటు వరకు సుమారు రెండు కిలో మీటర్ల మేర తొలగించి సుమారు రెండేళ్ళు అవుతోంది. అప్పటి నుంచి వాటి గురించి పట్టించుకునే వారులేరు. రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్లాలంటే పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెల రోజుల క్రితం జాతీయ రహదారికి ఇరువైపులా వందకుపైగా కొత్త స్థంభాలు ఏర్పాటు చేసినా వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపో వడంతో అలంకారప్రాయంగా మారాయి.



అంధకారంలో ఉన్న ములకలచెరువు జాతీయ రహదారి

ఇరువర్గాల మధ్య ఘర్షణ



ఘర్షణలో ముష్టిఘాతాలకు దిగిన ఇరువర్గాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 9:మదనపల్లెలో వినాయక చవితి సందర్భంగా గణపతి పూజల విషయమై ఇరువర్గాల మధ్యఘర్షణ చోటు చేసు కుంది. ఆదివారం రాత్రి నుంచి పూజ విషయంలో ఇరువర్గాలు వాదోపవాదాలు చేసుకుంటున్నాయి, పట్టణంలోని పోలీసు క్వార్టర్స్‌కు సమీపంలోని వీధిలో మండపం ఏర్పాటు చేసి శనివారం వినా యకుడిని ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. సోమవారం పూజల విషయంలో ఇద్దరు యువ కులు గొడవ పడ్డారు. స్థానికులు అడ్డుకొంటున్నా వినకుండా పరస్పరం పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఓ యువకుడిని కిందపడేసీ కొట్టి గొడవకు దూకారు. కాలనీకి చెందిన కొందరు ఇరువర్గాలను అడ్డుకుని సర్దిచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. కాగా పట్టణంలో ఎలాంటి సంఘటనలు జరుగకుండా వివాదాస్పద ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. పోలీస్ స్టేషన్ కూత వేటు దూరంలో సంఘటన జరుగుతున్నా పోలీసులు పట్టించుకోక పోవడంతో ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.